Follow: @ANNTELUGU
16-07-2026
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 193 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## 2027లో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తా

**బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్న కేటీఆర్**

**సరైన సమయంలో కేసీఆర్ ప్రజల్లోకి : ఢిల్లీ లో కేటీఆర్**

**ఢిల్లీ, మహా :** తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని, కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2027లో రాష్ట్రవ్యాప్తంగా తాను పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ప్రకటించారు. ప్రజల్లోకి వెళ్లడం ద్వారా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామన్నారు. ఇక కేసీఆర్ ప్రజల్లోకి ఎప్పుడు వస్తారనే అంశంపై స్పందిస్తూ.. రావాలనుకున్నప్పుడు కేసీఆర్ కచ్చితంగా ప్రజల మధ్యకు వస్తారని స్పష్టం చేశారు. ఆయనకు ఎలాంటి అభద్రతాభావం లేదని, సరైన సమయంలో ఆయన రంగంలోకి దిగుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన పేరిట తెలంగాణ ప్రజలను హింసిస్తున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

టాప్ న్యూస్

### తెలంగాణలోనూ సర్ గడువు పొడిగింపు



- ఆగస్టు 3 ఆఖరు తేదీ అని ప్రకటించిన ఈసీ
- కొత్త షెడ్యూల్ ను విడుదల చేసిన ఈసీ

03


### ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవుల భర్తీ



- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- రేణుకాచౌదరికి ఫోన్

02

### షాబాద్ హత్యలకు పోలీసులే కారణం



- పోక్సో అమలు కఠినతరం చేయాలి
- సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ లేఖ

02




## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ ది కీలకపాత్ర



**2034 నాటికి లక్ష కోట్ల పెట్టుబడులు రావాలి**

- డేటా సెంటర్ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు.
- తెలంగాణలో ఏడు బిలియన్ డాలర్ల పెట్టుబడులు ప్రకటించిన అమెజాన్
- పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని హామీ
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం



**ఫ్యూచర్ సిటీ (రంగారెడ్డి జిల్లా), మహా :** భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2034 నాటికి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాల సాధనకు తెలంగాణ ప్రయాణం ప్రారంభమైందని ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పానికి అమెజాన్ డేటా సెంటర్ తొలి మెట్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే అభివృద్ధి చెందిన మోడల్ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టే క్రమంలో అమెజాన్ కీలక భాగస్వామిగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. వచ్చే సంవత్సరాల్లో రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేలా సంస్థ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, అనుమతులు, సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి పెట్టుబడుల మిగతా 2వ పేజీలో

# కవిత దూకుడు



**23 నియోజకవర్గాలకు పార్టీ ఇంచార్జీల తొలి నియామకం**


- లక్కీనెంబర్ 5 వచ్చేలా.. ప్రకటన
- పార్టీ బలోపేతంపై కవిత ప్రత్యేక దృష్టి
- లక్కీ నంబర్ ఐదు సెంటిమెంట్‌తో ప్రకటన
- దశలవారీగా మిగిలిన నియామకాలు చేపడతాం
- ఆషాఢంలో శుభముహూర్తాన జాబితా విడుదల
- క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణకు కార్యాచరణ ప్రారంభం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత దూకుడు పెంచారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా రాష్ట్రవ్యాప్తంగా 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇంచార్జీలను నియమిస్తూ బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఈ తొలి నియామకాల్లో కవిత తన లక్కీ నంబర్ సెంటిమెంట్‌ను ప్రతిబింబించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. తాజా నియామకాల్లో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తన లక్కీ నంబర్ 5 వచ్చేలా వ్యవహరించారు. మొదటి విడతలో భాగంగా సరిగ్గా 23 మంది నియోజకవర్గ ఇంచార్జీల

## మణుగూరుకు ఒకేసారి.. నలుగురు మంత్రులు

**సీతారామ ప్రాజెక్టు పరిశీలనకు భట్టి, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో గురువారం రాష్ట్ర మంత్రుల భారీ పర్యటన జరగనుంది. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఒకేసారి మణుగూరుకు రానున్నారు. ఒకే రోజు నలుగురు కీలక మంత్రులు పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనను భారీ ఎత్తున విజయవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంత్రుల బృందం పినపాక నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించనుంది. ఇందులో భాగంగా మారెళ్లపాడు, సీతమ్మ బ్యారేజీ ప్రాంతాలలో జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పెండింగ్ పనులు, నిర్మాణ వేగం, భవిష్యత్ కార్యాచరణపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.




## ఆదిలాబాద్ సీసీఐని వెంటనే తెరిపించాలి

- ఆదిలాబాద్ సీసీఐ వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన కేటీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని కేటీఆర్ డిమాండ్
- ప్లాంట్ తెరిపించే వరకు పోరాటం కొనసాగిస్తాం
- రూ.2000 కోట్ల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీ ప్రతిపాదన
- వేలాది ఉద్యోగాలకు సీసీఐ పునరుద్ధరణ కీలకం



## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి షోకాజ్ ఆ ఆడియో తనది కాదని ప్రకటన

**హైదదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి కి ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ కమిటీ షాక్ ఇచ్చింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా వ్యవహరించారన్న ఆరోపణలపై ఐవైసీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు చెందిన ఒక సీనియర్ మహిళా నేతపై శివచరణ్ రెడ్డి అనుచిత భాషను ఉపయోగించారని, అలాగే వివిధ కులాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వంపై కూడా అవమానకరమైన పదజాలాన్ని వాడారని ఈ నోటీసులో



పేర్కొన్నారు. అయితే ఆ ఆడియో తనది కాదని, తనపై కొందరు కుట్ర చేస్తున్నారని శివచరణ్ రెడ్డి అన్నారు.

# ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవుల భర్తీ

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
**రేణుకాచౌదరికి ఫోన్**



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ, గతంలో పనితీరు కనబరిచిన వారికి మరోసారి అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ కమిటీల పనితీరును పార్టీ నిరంతరం సమీక్షిస్తోందని, పనితీరు సంతృప్తికరంగా లేకపోతే అవసరమైన చోట మార్పులు చేసే అవకాశం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నియామకాలపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై పార్టీ వ్యవహారాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. పదవుల పునర్నియామకంపై ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదని, మండల కమిటీల ఏర్పాటులో డీసీసీ అధ్యక్షుల నివేదికలకే ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఖమ్మం రాజకీయాలపై ఇటీవల ఎంపీ రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యల వివాదంపైనా మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ అంశంపై రేణుకా చౌదరితో తాను మాట్లాడానని తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కాంగ్రెస్ వైపు చూస్తున్నాయనే ఉద్దేశంతో వ్యాఖ్యానించానని రేణుకా చౌదరి తనతో చెప్పారని, అయితే ఆమె వ్యాఖ్యలను కొందరు వక్రీకరించి దుష్ప్రచారం చేశారని అన్నారు. మిత్రపక్షమైన సీపీఐ నేత కూనంనేని సాంబశివరావుతో కాంగ్రెస్‌కు ఎలాంటి విభేదాలు లేవని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానికంగా కాంగ్రెస్ క్యాడర్ ప్రయోజనాలను కాపాడే క్రమంలోనే కొన్ని వ్యాఖ్యలు వచ్చి ఉండొచ్చని తెలిపారు. అలాంటి సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి చిన్న అంశాన్ని గాంధీభవన్‌కు తీసుకురావాల్సిన అవసరం లేదని పార్టీ శ్రేణులకు సూచించారు.రాష్ట్రంలోని డీసీసీ అధ్యక్షుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన టీపీసీసీ అధ్యక్షుడు, నలుగురు లేదా ఐదుగురు మినహా మిగిలిన డీసీసీ అధ్యక్షులంతా సమర్థవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.



# ఆదిలాబాద్ సీసీఐని వెంటనే తెరిపించాలి

కేంద్ర మంత్రిని కోరిన కేటీఆర్

ఢిల్లీ, మహా : ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్‌ను వెంటనే తెరిపించాలని కేంద్ర హెవీ ఇండస్ట్రీస్ శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్య నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీసీసీఐ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని మంత్రి స్పష్టం చేశారన్నారు. ప్లాంట్ పునఃప్రారంభం కావడానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోత్సాహం, చిత్తశుద్ధి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్రం అడిగిన వివరాలపై స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్లాంట్ కోసం ఎలాంటి ప్రతిపాదనలు చేస్తుందో, ఎంత పెట్టుబడి పెడుతుందో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మారుమూల ప్రాంతానికి చెందిన వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ ప్లాంట్‌ను తెరిపించే వరకూ బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. నేతల విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారని కేటీఆర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ప్లాంట్‌ను మళ్లీ నడపాలనే బలమైన కోరికతోనే ఉన్నదని చెప్పారు. అక్కడ 2,300 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నదని.. అందులో 770 ఎకరాలు కంపెనీకి చెందిన పట్టా ల్యాండ్ కాగా, 1,500 పైచిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ రూపంలో ఉన్నదని పేర్కొన్నారు. ఇక్కడ రూ.2,000 కోట్ల పెట్టుబడితో సరికొత్త ఫ్యాక్టరీని పెట్టినట్లయితే చాలా బాగుంటుందని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారని తెలిపారు. అయితే.. ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రధాన ఆటంకంగా మారిందని నేతలు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా బీఆర్ఎస్ అనేక సందర్భాల్లో చేసిన ఒత్తిడి ఫలితంగా సీసీఐ ఆదిలాబాద్ పునరుద్ధరణపై ్నట్టు కేటీఆర్ తెలిపారు.

# కవిత దూకుడు

| ఇన్ ఛార్జిలు వీరే |
|---|
| తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గాల ఇన్ ఛార్జీల వివరాలు: |
| సిర్పూర్ కావటి సబిత (బీసీ) |
| బెల్లంపల్లి బోడ జనార్దన్ (మాజీ మంత్రి ఎస్సీ) |
| బోథ్ రాథోడ్ బాపురావు (మాజీ ఎమ్మెల్యే ఎస్టీ) |
| ఆర్మూరు మంథెన నవీన్ రెడ్డి (ఓసీ) |
| ఎల్లారెడ్డి ఎదురుగట్ల సంపత్ గౌడ్ (బీసీ) |
| కామారెడ్డి నంగునూరి రవీందర్ గుప్తా (ఓసీ) |
| జగిత్యాల పునుగోటి పవన్ రావు (ఓసీ) |
| మానకొండూరు చెన్నమల్ల చైతన్య (ఎస్సీ) |
| సిరిసిల్ల ఎండీ అబ్దుల్ మాజిద్ (బీసీ) |
| సంగారెడ్డి కె. దయాకర్ రెడ్డి |
| ఆందోల్ మానన్నూరి బాలయ్య (ఎస్సీ) |
| నారాయణఖేడ్ మలిశెట్టి డాప (బీసీ) |
| నర్సాపూర్ చెల్లంగారి (దండు) అపర్ణ (బీసీ) |
| మెదక్ బట్టి అజయ్ (బీసీ) |
| శేరిలింగంపల్లి వాసిలి చంద్రశేఖర ప్రసాద్ (ఓసీ) |
| తుంగతుర్తి సూరారపు కృష్ణవేణి (ఎస్సీ) |
| స్టేషన్ ఘన్ పూర్ చిలుక ప్రవీణ్ (ఎస్సీ) |
| మక్తల్ డీకేహెచ్ వెంకటన్న (బీసీ) |
| గద్వాల్ గొంగళ్ల రంజిత్ కుమార్ (బీసీ) |
| నారాయణపేట్ గవిన్నోళ్ల శ్రీనివాస్ (బీసీ) |
| మునుగోడు కర్నాటి మాధవి |
| పెద్దపల్లి నలేంద్ర కొమురయ్య (బీసీ) |
| హుస్నాబాద్ పూరెళ్ల శ్రావణ్ కుమార్ గౌడ్ |



( మొదటి పేజీ తరువాయి )

జాబితాను ఆమె ఖరారు చేశారు. సంఖ్యాశాస్త్రం ప్రకారం 23 సంఖ్యలోని ఆ అంకెలను కూడితే ఐదు వస్తుంది. తన లక్కీ నంబర్ కలిసివచ్చేలా కవిత ఈ సంఖ్యను ఎంచుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం నడుస్తున్న ఆషాఢ మాసంలో శుభ ముహూర్తాన నియోజకవర్గ ఇంచార్జీలను కవిత ప్రకటించారు. తొలి విడతగా 23 స్థానాలకు ఇంచార్జీలను ప్రకటించగా.. రాబోయే రోజుల్లో మిగిలిన నియోజకవర్గాలపై దృష్టి పెట్టనున్నారు. రాష్ట్రంలోని మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా ఇదే తరహాలో దశల వారీగా ఇంచార్జీల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నట్లుగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సిర్పూరు నుండి హుస్నాబాద్ దాకా కవిత ఇన్ ఛార్జిలను ప్రకటించారు.

## ఫ్యూచర్ సిటీలో
# అమెజాన్ ది కీలకపాత్ర

( మొదటి పేజీ తరువాయి )


కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం తెలిపారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్-500 సంస్థలను ఆకర్షించే ఉద్దేశంతోనే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని, అందులో 108 దేశాల ప్రతినిధులు, మూడు వేలకుపైగా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని గుర్తుచేశారు. అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థల రాకతో మరిన్ని ప్రపంచ స్థాయి కంపెనీలు తెలంగాణ వైపు ఆకర్షితులవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్రం ఇప్పటికే ఐదు శాతం మేరకు వాటా అందిస్తోందని, 2047 నాటికి దీన్ని పది శాతానికి పెంచాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఈ లక్ష్యాల సాధనకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల సృష్టి అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. అందుకే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సహకారంతో తెలంగాణ రైజింగ్-2047 విజన్ పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచేందుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు.

**తెలంగాణలో ఏడు బిలియన్ డాలర్ల పెట్టుబడి**

వచ్చే 14 సంవత్సరాల్లో అమెజాన్ సంస్థ తెలంగాణలో ఏడు బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సీఎం తెలిపారు. అయితే రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే దిశగా సంస్థ ముందుకు రావాలని కోరారు. పెట్టుబడుల పురోగతిపై ప్రతి నెలా స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా



ఉంటుందని హామీ ఇచ్చారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు స్పష్టమైన విధానాలను రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. పర్యాటకం, వైద్యం, క్రీడలు తదితర రంగాలకు ప్రత్యేక విధానాలు అమలు చేస్తున్నామని, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అమెజాన్ డేటా సెంటర్ తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో తొలి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని మూడు ప్రధాన ప్రాంతాలుగా విభజించి కార్యాచరణ చేపట్టామని సీఎం వివరించారు. హైదరాబాద్ మహానగరాన్ని సేవారంగ కేంద్రంగా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు పారిశ్రామిక తయారీ కేంద్రంగా, ఆర్ఆర్ఆర్ వెలుపలి ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దే ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. మూసీ నది పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, డీజిల్‌తో నడిచే మూడు వేల ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. నగరంలో ఉన్న రెండు లక్షల డీజిల్ ఆటోలను దశలవారీగా మారుస్తూ విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఇందుకోసం ప్రతి సంవత్సరం రూ.1,500 కోట్ల ఆదాయాన్ని వదులుకుని కూడా ఈవీలపై జీరో పన్ను అమలు చేస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్, నీటి వనరులు, భూమి, నైపుణ్యాలు కలిగిన యువశక్తిని సిద్ధం చేస్తే తెలంగాణ తయారీ రంగంలో చైనాతో పోటీపడే స్థాయికి ఎదుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ మరవదని, వారికి మరింత మెరుగైన పరిహారం, భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, అమెజాన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ వివాదంలో కన్‌స్ట్రక్షన్స్‌కు ఊరట

**కఠిన చర్యలు వద్దని హైకోర్టు ఆదేశం.**

**హైదరాబాద్, మహా** హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలకు సంబంధించిన వివాదంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఈ వ్యవహారంపై తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిర్మాణ సంస్థపై ఎలాంటి బలవంతపు లేదా కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది.

సోమాజిగూడ నెక్లెస్ రోడ్ సమీపంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టింది. అయితే ఈ నిర్మాణం హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తోందని పేర్కొంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. భవన నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్-450 ప్రకారం జూలై 7న నోటీసులు జారీ చేసింది.

జీహెచ్ఎంసీ నోటీసులను సవాల్ చేస్తూ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది.

అదేవిధంగా ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ సమర్పించిన అనంతరం తదుపరి విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం తెలిపింది. హైకోర్టు తాజా ఆదేశాలతో చట్టపరమైన వివాదం కారణంగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. కేసు తుది విచారణ పూర్తయ్యే వరకు హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు కొనసాగనున్నాయి.



# హిందూ విశ్వాసాన్ని వ్యక్తం చేసినందుకు బెదిరింపులు సరికావు:

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.**

**హైదరాబాద్, మహా.:** హిందూ నినాదాలను ఆటోపై ప్రదర్శించినందుకు దాడికి గురైన భరత్‌కు అండగా నిలుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. మత విశ్వాసాన్ని వ్యక్తం చేసినందుకు ఎవరినీ బెదిరించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఈ ఘటనలో ఆటోను ధ్వంసం చేయడం, దుర్భాషలాడడం, బెదిరింపులకు పాల్పడడం ఖండనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా భరత్‌ను కలిసి పరామర్శించిన బండి సంజయ్, ఆయన ఒంటరివాడు కాదని భరోసా ఇచ్చారు. బెదిరింపులు, దాడులకు గురయ్యే ప్రతి హిందువుకు భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ధ్వంసమైన ఆటో స్థానంలో కొత్త ఆటోను అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రతి పౌరుడికి తన మత విశ్వాసాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసే రాజ్యాంగ హక్కు ఉందని, ఆ హక్కులను కాలరాసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. భరత్ పేరును ప్రస్తావిస్తూ, ఆయన హృదయం శ్రీరాముడిపట్ల భక్తితో నిండి ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడుతూ ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు.

# పార్లమెంట్ సమావేశాలకు కొత్త మార్గదర్శకాలు

**స్మార్ట్ పరికరాలపై ఆంక్షలు.**

**ఢిల్లీ, మహా:** జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు నిర్వహించనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం సభ్యులకు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. సమావేశాల సమయంలో భద్రత, వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యం ఇస్తూ స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ గ్లాసులు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించవద్దని సభ్యులను కోరింది.

ప్రస్తుతం మార్కెట్‌లో సులభంగా లభ్యమవుతున్న ఈ స్మార్ట్ పరికరాలను రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీయడానికి లేదా ఇతరుల గోప్యతకు భంగం కలిగించే విధంగా వినియోగించే అవకాశం ఉన్నందున వాటిపై పరిమితులు విధించినట్లు లోక్‌సభ సచివాలయం బులెటిన్‌లో పేర్కొంది. సమావేశాల సమయంలో ఎంపీలు అలాంటి పరికరాలను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శన, ఆయుధాల ప్రదర్శన, మతపరమైన కార్యక్రమాల నిర్వహణను పూర్తిగా నిషేధిస్తున్నట్లు సచివాలయం స్పష్టం చేసింది. అలాగే కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు, అవమానకర నినాదాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లను కూడా ప్రదర్శించరాదని పేర్కొంది.

ఇతర సభ్యులు తమ కార్యాలయాలు, ఛాంబర్లకు ఎలాంటి అంతరాయం లేకుండా వెళ్లేలా పార్లమెంట్ ప్రవేశ ద్వారాల వద్ద ఆందోళనలు, నిరసనలు నిర్వహించవద్దని ఎంపీలకు సూచించింది. గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా కొందరు సభ్యులు పార్లమెంట్ గేట్ల వద్ద నిరసనలు చేపట్టిన ఘటనలను ప్రస్తావిస్తూ, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేసింది.

పార్లమెంట్ సమావేశాలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి సభ్యుడు సభా నియమాలను గౌరవించాలని లోక్‌సభ సచివాలయం కోరింది. భద్రత, క్రమశిక్షణ, గోప్యత పరిరక్షణకు సంబంధించిన అన్ని మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది.

## తెలంగాణలోనూ
# సర్ గడువు పొడిగింపు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్ ను ఈసీ బుధవారం విడుదల చేసింది. కొత్త షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు చేపట్టే ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. గతంలో నిర్ణయించిన గడువు ముగియడంతో క్షేత్రస్థాయిలో ప్రక్రియను మరింత పారదర్శకంగా పూర్తి చేసేందుకు ఈ అదనపు సమయాన్ని కేటాయించారు. అలాగే పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఆగస్టు 3 నాటికి పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.సవరించిన షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. బీఎల్ఓల ఇంటింటి సర్వే ఆగస్టు 3, 2026 వరకు పొడిగించిన ఈసీ పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణను ఆగస్టు 3 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ ఆగస్టు 10 న విడుదల చేస్తారు. క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణను ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 9 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలపవచ్చు లేదా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. క్లెయిములు, అభ్యంతరాలను ఆగస్టు 10 నుండి అక్టోబర్ 8, 2026 లోపు వీటిని అధికారులు పరిష్కరిస్తారు. ఓటర్ల తుది జాబితాను అక్టోబర్ 12 న అధికారికంగా విడుదల చేస్తారు. సవరించిన షెడ్యూల్ సమాచారాన్ని రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నింటికీ లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సందీప్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఈ మార్పులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని స్పష్టం చేశారు. ఓటు హక్కు లేని వారు, మార్పులు చేర్పులు చేయాలనుకునే వారు ఈ పొడిగించిన గడువును ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## షాబాద్ హత్యలకు పోలీసులే కారణం

**సీఎం రేవంత్ కు పవన్ కల్యాణ్ లేఖ**

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డికి జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. పోక్సో కేసులో విచారణకు నిర్ణీత గడువు విధించాలని, పోక్సో కేసుల్లో బాధితుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, సాక్ష్యాధారాలు మాయం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోక్సో కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పిందని గుర్తు చేశారు. లేఖలో షాబాద్ హత్యల ఘటనను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. షాబాద్ కేసులో బాధితులను కాపాడడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. పోక్సో కేసు ఉన్నా నిందితుడికి బెయిల్ ఇవ్వడం వైఫల్యమేనని అభిప్రాయపడ్డారు. షాబాద్ ఘటనలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఆరోపించారు. పోక్సో అమలుకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ పవన్ కల్యాణ్ లేఖ రాశారు.

## డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు హసీనా?

**ఢాకా, మహా:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఈ ఏడాది డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వచ్చే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అవామీ లీగ్ పార్టీని తిరిగి బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆమె దేశానికి రావొచ్చని సమాచారం.ఈ నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు జహీద్ ఉర్ రెహమాన్ స్పందిస్తూ, హసీనా తిరిగి వస్తే ఆమెపై ఉన్న కేసుల్లో న్యాయ ప్రక్రియను ఎదుర్కోవాల్సిందేనని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉరిశిక్ష విధించే అవకాశం కూడా ఉందని వ్యాఖ్యానించారు.అయితే తుది నిర్ణయం పూర్తిగా న్యాయస్థానం విచారణ, సమర్పించే సాక్ష్యాధారాలపై ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం హసీనా రాకపై బంగ్లాదేశ్ రాజకీయాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.



# తాజ్ బంజారా ఇక జ్ఞాపకమే.

*** కూల్చివేత పనులు వేగవంతం.**
*** 40 అంతస్తుల భవనానికి మార్గం.**

హైదరాబాద్, మహా: హైదరాబాద్ నగర ఆతిథ్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన తాజ్ బంజారా హోటల్ త్వరలోనే చరిత్రలో కలిసిపోనుంది. బంజారాహిల్స్‌లో బంజారా సరస్సు ఒడ్డున నాలుగు దశాబ్దాలకుపైగా సేవలందించిన ఈ ప్రముఖ హోటల్ కూల్చివేత పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. హోటల్ స్థానంలో సుమారు 40 అంతస్తుల భారీ నివాస సముదాయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.బంజారా సరస్సును ఆనుకుని ఉన్న 3.4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ విలువైన ఆస్తిని అరబిందో రియాల్టీ సంస్థ రూ.315 కోట్లకు సొంతం చేసుకుంది. 2023లో హోటల్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులో అధికారికంగా కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. తొలిదశలో భవనంలోని తలుపులు, కిటికీలు, విద్యుత్ పరికరాలు, ఫర్నిచర్‌ను తొలగించిన యంత్రాంగం ప్రస్తుతం ప్రధాన భవనాన్ని కూల్చే పనులను కొనసాగిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తవడానికి మరో నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.

1979లో ప్రారంభమైన తాజ్ బంజారా హైదరాబాద్‌లో తొలి విలాసవంతమైన హోటళ్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, విదేశీ అతిథులకు ఇది ఎంతోకాలం ఆతిథ్యం అందించింది. నగర ఆతిథ్య రంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ హోటల్ అనేక జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు వేదికగా నిలిచింది.ప్రారంభ దశలో 1986 వరకు ఈ హోటల్‌ను ఐటీసీ గ్రూప్ నిర్వహించింది. అనంతరం దాదాపు నాలుగు దశాబ్దాల పాటు తాజ్ జీవీకే హోటల్స్ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగాయి. అయితే ఆర్థిక, పరిపాలనా కారణాలతో పాటు ఆస్తిపన్ను బకాయిల సమస్యలు హోటల్ భవిష్యత్తుపై ప్రభావం చూపాయి.సుమారు రూ.1.43 కోట్ల ఆస్తిపన్ను బకాయిల కారణంగా 2023లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హోటల్‌ను సీల్ చేశారు. అనంతరం కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు ఆ భవనాన్ని పూర్తిగా తొలగించి, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 40 అంతస్తుల నివాస సముదాయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నగరానికి ఒకప్పుడు గుర్తింపుగా నిలిచిన తాజ్ బంజారా హోటల్ ఇక జ్ఞాపకాలకే పరిమితం కానుంది.



# రైలు ప్రయాణికులకు శుభవార్త..

*** కొత్త ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌తో తత్కాల్ బుకింగ్ మరింత వేగం.**

**ఢిల్లీ, మహా :** రైలు ప్రయాణికులకు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) శుభవార్త అందించింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌ను మరింత వేగవంతంగా, సులభంగా నిర్వహించేందుకు అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. తరచూ ఎదురవుతున్న సర్వర్ సమస్యలు, బుకింగ్ ఆలస్యం, చెల్లింపుల అంతరాయాలకు పరిష్కారం చూపేలా ఈ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సూచనల మేరకు ఈ మార్పులకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికుల నుంచి వచ్చిన సూచనలు, ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఐఆర్‌సీటీసీ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ అప్‌గ్రేడ్ చేపట్టినట్లు పేర్కొన్నారు.

కొత్త వెబ్‌సైట్‌లో తత్కాల్ టికెట్ బుకింగ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు. ప్రస్తుతం నిమిషానికి సుమారు 32 వేల టికెట్లను మాత్రమే ప్రాసెస్ చేస్తున్న వ్యవస్థను అప్‌గ్రేడ్ చేసి, ఒకే నిమిషంలో 1.5 లక్షలకు పైగా టికెట్ బుకింగ్‌లను నిర్వహించే సామర్థ్యాన్ని కల్పించారు. దీంతో తత్కాల్ ప్రారంభమైన తొలి నిమిషాల్లో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఏర్పడనుంది.

ప్రయాణికుల ప్రశ్నలకు స్పందించే ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ సామర్థ్యాన్ని కూడా భారీగా పెంచారు. ప్రస్తుతం నిమిషానికి నాలుగు లక్షల ఎంక్వైరీలను మాత్రమే నిర్వహిస్తున్న వ్యవస్థను, కొత్త అప్‌గ్రేడ్ ద్వారా నిమిషానికి 40 లక్షల ఎంక్వైరీలను నిర్వహించే స్థాయికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. దీంతో సీట్ల లభ్యత తెలుసుకోవడం, రైళ్ల వివరాలు పరిశీలించడం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది.

తత్కాల్ బుకింగ్ సమయంలో ప్రయాణికులను ఇబ్బంది పెట్టే పాప్‌అప్ ప్రకటనలు, పదేపదే వచ్చే క్యాప్చా ధృవీకరణలను గణనీయంగా తగ్గించారు. బుకింగ్ ప్రక్రియను మరింత సరళీకరించడం ద్వారా తక్కువ సమయంలో టికెట్‌ను పూర్తి చేసుకునే వీలు కల్పించారు. అలాగే స్లీపర్, తృతీయ ఏసీ, ద్వితీయ ఏసీ తదితర అన్ని తరగతుల సీట్ల లభ్యతను ఒకే తెరపై చూసే విధంగా యూనిఫైడ్ వ్యూ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫేర్ క్యాలెండర్ సదుపాయాన్ని కూడా కొత్త వెబ్‌సైట్‌లో ప్రవేశపెడుతున్నారు. వివిధ తేదీల్లో టికెట్ ధరలను ముందుగానే పోల్చుకుని అనువైన తేదీని ఎంపిక చేసుకునే అవకాశం ఇందులో ఉంటుంది. బుకింగ్ సమయంలోనే తమకు నచ్చిన సీటు లేదా బెర్త్‌ను ఎంచుకునే సదుపాయాన్ని కూడా కల్పించనున్నారు.

ప్రాంతీయ భాషలకు మరింత ప్రాధాన్యం ఇస్తూ బహుభాషా సేవలను విస్తరించనున్నట్లు ఐఆర్‌సీటీసీ వెల్లడించింది. అలాగే దివ్యాంగులు, విద్యార్థులు, రోగులు పొందే టికెట్ రాయితీలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చి దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయనున్నారు.

కొత్త వెబ్‌సైట్ లేదా దాని బీటా వెర్షన్‌ను జూలై 15న ప్రారంభించే ప్రణాళిక ఉన్నప్పటికీ, బ్యాకెండ్ వ్యవస్థల అప్‌గ్రేడ్ పనులు కొనసాగుతున్నందున అధికారికంగా ఆగస్టు రెండో వారంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఈ అప్‌గ్రేడ్ పూర్తయితే దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైలు ప్రయాణికులకు వేగవంతమైన, అంతరాయం లేని టికెట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

**డు కీలక నిర్ణయాలకు ఆమోదం.**



**ఢిల్లీ, మహా. :** దేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో మొత్తం రూ.2,19,353 కోట్ల విలువైన ఏడు ప్రధాన ప్రాజెక్టులు, విధానాలకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్ల తయారీ, మొబైల్ ఫోన్ ఉత్పత్తి, ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి, వారణాసి మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైల్వే విస్తరణ వంటి రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు.భారత్‌ను ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సెమీకాన్-2.0 కార్యక్రమానికి కేంద్రం రూ.1,27,500 కోట్ల భారీ కేటాయింపును ఆమోదించింది. ఈ నిధులతో అత్యాధునిక సెమీకండక్టర్ తయారీ యూనిట్లు, చిప్ డిజైన్, ప్యాకేజింగ్, పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించనున్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశ స్వయం సమృద్ధిని పెంచడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌కు మరింత కీలక స్థానం కల్పించడమే ఈ పథకం లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేందుకు మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ కింద రూ.62,500 కోట్ల కేటాయింపుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా మొబైల్ ఫోన్ ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు ఎగుమతులు వృద్ధి చెందుతాయని, వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశాన్ని ప్రపంచ మొబైల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.వ్యవసాయ రంగానికి సంబంధించి జాతీయ యూరియా పెట్టుబడి విధానం-2026కు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ దేశీయంగా యూరియా ఉత్పత్తిని పెంచడం, రైతులకు అవసరమైన ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం పేర్కొంది. దీనికి ప్రత్యేక ఆర్థిక కేటాయింపులు చేయకపోయినా, విధానపరమైన మార్పుల ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించి దేశీయ ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు తీసుకోనున్నారు.పవిత్ర క్షేత్రమైన వారణాసి నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి ఆధునిక రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రూ.25,446 కోట్లతో రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వరుణా నది వెంబడి రూ.10,998 కోట్ల వ్యయంతో నాలుగు, ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనుండగా, గంగా నది వెంబడి రూ.14,448 కోట్లతో ఆరు లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వారణాసి నగరంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు పర్యాటక, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తం రూ.3,907 కోట్లతో రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఒడిశాలోని పారాదీప్-హరిదాస్‌పూర్ రైల్వే మార్గాన్ని రూ.2,542 కోట్ల వ్యయంతో డబ్లింగ్ చేయనుండగా, డాంగోవాపోసి-రాజ్‌ఖర్సవాన్ మార్గంలో రూ.1,365 కోట్లతో నాలుగో రైల్వే లైన్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా వేగవంతం కావడంతో పాటు ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ, వ్యవ`సాయ రంగ అభివృద్ధి, ఉపాధి కల్పనకు దోహదపడతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ముఖ్యంగా సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులు భారత్‌ను ప్రపంచ సరఫరా గొలుసులో మరింత బలోపేతం చేస్తాయని, యూరియా విధానం రైతులకు ప్రయోజనం చేకూర్చనుండగా, వారణాసి, రైల్వే ప్రాజెక్టులు దేశ రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించనున్నాయని ఆయన పేర్కొన్నారు.

# ఉక్రెయిన్ రేవులపై రష్యా ఉక్కుపాదం.

- **ధాన్య ఎగుమతులపై తీవ్ర ప్రభావం.**



**కీవ్, మహా.** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. ఈసారి ఉక్రెయిన్‌కు అత్యంత కీలకమైన నల్లసముద్ర రేవులూ, ధాన్య ఎగుమతి మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని రష్యా క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల మధ్య కూడా ప్రపంచ ఆహార భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా ధాన్యాల ఎగుమతులను కొనసాగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఉక్రెయిన్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తమ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమని ఉక్రెయిన్ డిప్యూటీ ఆర్థిక మంత్రి తారస్ వైసోత్స్కీ తెలిపారు. పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ గత ఏడాది స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ధాన్యాల ఎగుమతులను కొనసాగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ ఆహార భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.జూలై నుంచి ప్రారంభమైన 2026-27 మార్కెటింగ్ సీజన్‌లో సుమారు 43 మిలియన్ మెట్రిక్ టన్నుల ధాన్యాలను ఎగుమతి చేయాలని ఉక్రెయిన్ లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాది 37 మిలియన్ టన్నులకు పైగా ధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే తాజా దాడుల కారణంగా ఆ లక్ష్యాలపై అనిశ్చితి నెలకొంది. ఉక్రెయిన్ రైతు సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం, రష్యా క్షిపణి, డ్రోన్ దాడులతో నల్లసముద్ర రేవుల ద్వారా ధాన్యాల ఎగుమతి సామర్థ్యంలో ఇప్పటికే దాదాపు మూడో వంతు దెబ్బతిన్నట్లు అంచనా వేస్తున్నారు. విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చే ప్రధాన రంగమైన వ్యవసాయ ఎగుమతులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఉక్రెయిన్ ధాన్యాలు, వంటనూనెల ఎగుతుల్లో తొంభై శాతానికి పైగా ఒడెస్సా ప్రాంతంలోని మూడు ప్రధాన సముద్ర రేవుల ద్వారానే జరుగుతున్నాయి. అయితే దాడుల భయంతో దేశంలోని 13 ప్రధాన ధాన్య ఎగుమతి టర్మినళ్లలో నాలుగు టర్మినళ్లు ఇప్పటికే కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశాయి. భద్రతా పరిస్థితులు మరింత దిగజారడంతో కొన్ని అంతర్జాతీయ నౌకాయాన సంస్థలు తమ నౌకలను ఉక్రెయిన్ రేవులకు పంపేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. యుద్ధంలో ఇరు దేశాలు ఒకదానికొకటి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. ఉక్రెయిన్ రష్యా చమురు నిల్వలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు కొనసాగిస్తుండగా, దానికి ప్రతిగా రష్యా నల్లసముద్ర తీరంలోని రేవులు, ధాన్య ఎగుమతి కేంద్రాలపై దాడులను మరింత ఉధృతం చేసింది. బుధవారం కూడా ఒడెస్సా, మైకోలైవ్ ప్రాంతాల్లోని పోర్టు మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు జరిపినట్లు స్థానిక అధికారులు ధ్రువీకరించారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆహార సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశాల నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ

**టీఎంసీకి మాజీ మంత్రి మదన్ మిత్ర రాజీనామా.**

కోల్‌కతా, మహా. : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, కమర్హాటి ఎమ్మెల్యే మదన్ మిత్ర పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం రీతాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గంలో చేరినట్లు ప్రకటించారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది

పార్టీని వీడిన అనంతరం మదన్ మిత్ర తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ నిర్ణయాలు కొద్దిమంది చుట్టూనే కేంద్రీకృతమయ్యాయని, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ బలోపేతం కంటే వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అభిషేక్ బెనర్జీ కొంతకాలం పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండి, సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలని తాను సూచించినప్పటికీ ఆ ప్రతిపాదనను పట్టించుకోలేదని పేర్కొన్నారు. పార్టీ అందరిదీ కాకుండా ఒకే నాయకత్వం చుట్టూ తిరుగుతోందని వ్యాఖ్యానించారు.

తాను ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటికీ, రాజకీయంగా తృణమూల్ కాంగ్రెస్‌తో అన్ని సంబంధాలను తెంచుకున్నానని మదన్ మిత్ర స్పష్టం చేశారు. భవిష్యత్తు రాజకీయ పరిణామాలపై ప్రజలే తీర్పు ఇస్తారని, కాలమే ఏ రాజకీయ శక్తి ముందుకు సాగుతుందో నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఎదుర్కొన్న పరాజయం అనంతరం పార్టీలో అంతర్గత విభేదాలు మరింత బహిర్గతమయ్యాయి. రీతాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం పార్టీపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తుండగా, పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ స్వయంగా రంగంలోకి దిగారు. పార్టీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా మదన్ మిత్ర, కునాల్ ఘోష్‌లను జనరల్ సెక్రటరీలుగా నియమించారు.

అయితే ఆ నియామకం జరిగిన కొద్ది రోజులకే మదన్ మిత్ర పార్టీకి రాజీనామా చేసి తిరుగుబాటు వర్గంలో చేరడం తృణమూల్ కాంగ్రెస్‌కు రాజకీయంగా ఎదురుదెబ్బగా మారింది. పార్టీలో నాయకత్వ శైలి, నిర్ణయాలపై నెలకొన్న అసంతృప్తి బహిర్గతమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం ఎలా పరిణమిస్తుందన్నది పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.**
- **మంచాలలో డబుల్ బెడ్ రూమ్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**
- **పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు..**



**ఇబ్రహీంపట్నం జూలై 15 మహా:** గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మందాల మండలం రంగాపూర్ గ్రామంలో రోడ్డు విస్తరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై 9 కోట్ల రుపాయలతో రంగాపూర్ నుండి మాల్ గ్రామం వరకు నిర్మాణ పనులు శంకుస్థావన చేసి, అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే ప్రజా భవన్ కార్యాలయంలో జరిగిన, మందాల మండలం లింగంపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్లను అర్హులైన లబ్దిదారులకు ఎంపిక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు పరిపాలించి ఏనాడు పేద ప్రజల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. నియోజకవర్గానికి అధిక నిధులు తిసుకవచ్చి విద్య, వైద్యంతో పాటు రోడ్లు, భవనాలను, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారిస్తానని హమీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో యుద్ధ ప్రాతివధికంగా సంక్షేమం, అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు విమర్శించటం తగదన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ వై శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, హనుమంత్ రెడ్డి, ఈసీ శేఖర్ మామ, ప్రేమాకర్ రెడ్డి, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, భరత్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్ వివిధ గ్రామల సర్పంచులు, అధికారులు, లబ్దిదారులు పాల్గోన్నారు.

# సీఎం రేవంత్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**అధికారులకు కలెక్టర్ దివాకర్ ఆదేశాలు.**

**ఖమ్మం, మహా:** వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల మండలం అంజనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం కార్యక్రమ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఫ్యాక్టరీ ప్రాంగణం, సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని పేర్కొన్న జిల్లా కలెక్టర్, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. సభా ప్రాంగణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు వేర్వేరు మార్గాలు, ప్రత్యేక కూర్చునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్యారికేడింగ్, సూచిక బోర్డులు, తగినంత వెలుతురు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు శాఖకు కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా బహుస్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు రహదారులను పూర్తిస్థాయిలో పరిశీలించి మరమ్మతులు, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పూర్తి చేయాలని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసి ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్సులు, వైద్య బృందాలు, అత్యవసర చికిత్సా కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక శాఖ ఫైర్ టెండర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, పారిశుధ్యం, వ్యర్థాల తొలగింపు వంటి అంశాల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు.

గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభంతో రాష్ట్రంలో పామాయిల్ సాగుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉన్నందున వారి అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖ అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, రహదారులు-భవనాల శాఖ, పంచాయతీ రాజ్, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, రవాణా, మున్సిపల్, వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమల శాఖల అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# అయినా..హస్తినపోవలె...



నేను ప్రజా నాయకుడిని. ప్రజల సమస్యల పరిష్కారం నా బాధ్యత. రాష్ట్ర అభివృద్ధి నా ధ్యేయం. ఇందు కోసం ఎన్ని సార్లు అయినా ఢిల్లీకి వస్తాను. పనులు పూర్తి అయ్యే వరకు వదిలి పెట్టను. నా ఢిల్లీ టూర్ పైన విమర్శలు చేసే వారిని పట్టించుకోను. అసలు దాని గురించి ఆలోచన కూడా చేయను. ప్రతీది రాజకీయం చేసే వాళ్ళు ఎప్పుడు వుంటారు. వారి గురించి టైం వేస్ట్ చేసుకోవటం వల్ల వచ్చే ప్రయోజనం ఏమి లేదు. ఇది తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలపైన ఇచ్చిన క్లారిటీ. రేవంత్ పదే, పదే ఢిల్లీ పర్యటనలు చేస్తూ ప్రజాధనం వృధా చేస్తున్నారని, ఆయన ఢిల్లీ టూర్ల వల్ల రాష్ట్రానికి ఒరిగింది ఏమి లేదని విపక్షాలు చేస్తున్న విమర్శలకు సీఎం రేవంత్ గట్టిగానే సమాధానం ఇచ్చారు. సీఎం హోదాలో తాను కేంద్రంతో పలు అంశాలపైన చర్చించడానికి, రాష్ట్ర అవసరాలు కేంద్రం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీ పర్యటనలు చేస్తే తప్పేముంది అంటారు సీఎం. దీన్ని విపక్షాలు అదే పనిగా ప్రచారం చేయటం అర్థం లేనిదని సీఎం అభిప్రాయం. ఇందులో నిజం లేక పోలేదు. కేంద్రం, రాష్ట్రం మధ్య అనేక అంశాలు ఉంటాయి. ఇందులో పరస్పర సహాయం, సహకారం అవసరం. రాష్ట్రంనే కూర్చొని కేంద్రంతో పనులు చేయించుకోవటం అంత సులభం కాదు. ఇక తెలంగాణలో వున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. కేంద్రంలో వున్నది బీజేపీ నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వం. ఈ రెండింటికి రాజకీయ వివాదాలు, విబేధాలు వున్నాయి. ఈ నేపథ్యంలో ఒకటికి పది సార్లు ఢిల్లీ వెడితే తప్పా రాష్ట్ర అవసరాలకు కేంద్రం ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి లేదు. పది మార్లు ఢిల్లీ పెద్దలను కలిసినా రాష్ట్రానికి సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటికి మోక్షం లభించలేదు. అయినా సీఎం పట్టు వదలటం లేదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన ప్రయోజనాల కోసం ఎప్పటికప్పుడు ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ఇందులో ఆయన చిత్తశుద్ధి కనిపించడం విపక్షాలకు కొంత ఇబ్బందిగా మారుతోంది. దీంతో సీఎం ఢిల్లీ టూర్ ను తప్పు పట్టడం, ప్రజాధనం మొత్తం సీఎం ఢిల్లీ టూర్ల కోసమే ఖర్చు చేస్తున్నట్టు వాదనలు చేయటం పరిపాటిగా మారిపోయింది.

కాంగ్రెస్ జాతీయ పార్టీ. ఆ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా పాలసీ అమలు చేయాలంటే పార్టీ పెద్దలను సంప్రదించాలి. జాతీయ పార్టీ అయిన బీజేపీలో కూడా ఈ సంప్రదాయం వుంది. సీపీఐ, సీపీఎం వంటి వామ పక్ష జాతీయ పార్టీలు కూడా ఇదే విధానం అనుసరించి ముందుకు సాగుతున్నాయి. ఇక రాష్ట్రానికి సంబందించిన వివిధ అభివృద్ధి అంశాలు కేంద్రంతో ముడి పడి ఉండటం సహజం. ఇవి అమలుకు నోచుకోవాలంటే ఏ రాష్ట్రంలోని సీఎంలు అయినా కేంద్రం నుంచి అనుమతి పొందాలి. దాని కోసం ఢిల్లీ పర్యటనలు తప్పనిసరిగా చేయాలి. అయితే కాంగ్రెస్ జాతీయ పార్టీ కావటం, ఆ పార్టీకి చెందిన పెద్దలు ఢిల్లీలోనే ఉండటంతో సీఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల సీఎంల కన్నా ఎక్కువగా ఢిల్లీ పర్యటనలు చేయాల్సిన అవసరం వస్తోంది. దీన్ని విపక్షాలు ఓ ఆయుధంగా వాడుకుంటున్నాయంటున్నారు రాజకీయ పరిశీలకులు. సీఎం ఢిల్లీ పర్యటనల వల్ల ప్రయోజనం ఏమిటీ అంటూ విపక్షాలు సూటిగా అడుగుతున్నాయి. దీనికి రేవంత్ నుంచి సమాధానం వచ్చింది. ఢిల్లీ పెద్దలను పలుమార్లు కలవడం వల్లే రాష్ట్రంలోని కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు చలనం వచ్చిందని సీఎం ఇప్పటికే వివరించారు. ఈ సారి ఢిల్లీ పర్యటనలో ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్టుల నిర్మాణం అంశంపైన సీఎం రేవంత్ ఓ క్లారిటీ తీసుకొని రాగలిగారు. వీలైనంత త్వరగా వీటి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే ప్రయత్నంలో ఓ అడుగు ఆయన ముందుకు వేయగలిగారు అంటున్నారు కాంగ్రెస్ నేతలు. సీఎం ఢిల్లీ పర్యటనలను తప్పు పట్టటం అంటే అభివృద్ధికి అడ్డు పడటమే అంటున్నారు కాంగ్రెస్ నేతలు. సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్రంలోని పెద్దలకు రాష్ట్ర ప్రయోజనాలను గట్టిగా తెలియజేస్తున్న తీరును విపక్షాలు గుర్తించాలని వారు అంటున్నారు. సీఎంలు ఢిల్లీ పర్యటనలు చేయటం పరి పాలనలో ఓ భాగంగా వాళ్ళు వివరిస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఈ సారి ఢిల్లీ పర్యటనలో రాష్ట్రానికి సంబందించిన కీలక అంశాలు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకుని వచ్చారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన సీఎం రేవంత్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై చర్చించారు. దీనికి సంబందించిన భూ సేకరణ వివరాలు తెలిపారు. నిర్మాణం కోసం అనుమతి కోరారు. హైదరాబాద్ నుంచి ఏపీ రాజధాని అమరావతికి గ్రీన్ ఫీల్డ్ రహదారి ఏర్పాటు వాగ్దానం గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం గురించి వివరించారు. ఇక్కడ నుంచి బందర్ పోర్టు వరకు రహదారి ఏర్పాటు అంశం ప్రస్తావనకు తెచ్చారు. రాష్ట్రంలోని వివిధ రహదారుల నిర్మాణం ఆవశ్యకత కేంద్ర మంత్రి ముందు పెట్టారు. ఇక హైదరాబాద్ లోని హుసేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు సీ ప్లేన్ నడిపించే అవకాశం గురుంచి కూడా కేంద్రంలోని పెద్దలతో చర్చించిన సీఎం రేవంత్ రాష్ట్రాని కేంద్రం నుంచి అందాల్సిన సహాయం మరోసారి గుర్తు చేశారు. సీఎం రాష్ట్రానికే పరిమితం అయితే ప్రగతి ఎలా సాధ్యం అవుతుంది. సీఎం రేవంత్ ఎన్ని సార్లు ఢిల్లీ వెళ్లినా అది రాష్ట్రం కోసం మాత్రమేనని కాంగ్రెస్ నేతలు చెప్పుకొస్తున్నారు. సీఎం ఢిల్లీ టూర్ ను తప్పు పట్టే విపక్షాలు ఆయన రాష్ట్ర ప్రగతి కోసం చేస్తున్న ప్రయత్నం గురించి మాత్రం మాట మాత్రమైన ప్రస్తావనకు తేవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం, రాష్ట్రం మధ్య పరస్పర బంధాలు లేకపోతే పరిస్థితి దారుణంగా మారుతుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి అంద వల్సిన నిధులు, చేయాల్సిన విధుల్లో గ్యాప్ వస్తుంది. ఇది రాష్ట్ర ప్రగతిని దెబ్బ తీస్తుంది. దేశంలోని పలు రాష్ట్రాలలో ఇలాంటి ఇబ్బందికర పరిణామాలు ఇప్పటికే అనుభవంలోకి వచ్చాయి. కేంద్రంతో పేచీలు పెట్టుకుని, గొడవలతో రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహం చవిచూడాల్సి వచ్చింది. దీన్ని సీఎం రేవంత్ రెడ్డి బాగానే అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది. అవసరమైన సమయంలోనే మాత్రమే అది కూడా రాజకీయ, పాలనా పరమైన విషయాలలో మాత్రమే రేవంత్ కేంద్ర వైఖరిని ఎండగడుతున్నారు. దాన్ని అక్కడితో వదిలేస్తున్నారు. నిరంతరం ముడుచుకొని కూర్చునే విధానానికి దూరంగా ఉంటున్న సీఎం సమయానికి తగ్గట్టు వ్యవహారం చక్కబెట్టటం గమనార్హం. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో ఇప్పుడు రేవంత్ కు బాగా అర్థమైంది. తన ఢిల్లీ టూర్ల పై విపక్షాల విమర్శలకు సూటిగా సమాధానం చెప్పిన రేవంత్ గిట్టని వాళ్ళు ఏమి మాట్లాడినా తాను పట్టించుకోనంటూ చెప్పేశారు. ఎవరో ఏదో అన్నారని ఢిల్లీ పర్యటనలను ఆపుకునే పరిస్థితి తనకు లేదనే సాంకేతాలు ఇచ్చేశారు. ఇక సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనల పైన విపక్షాలు ఏం రచ్చ చేసినా దానికి స్పందన పెద్దగా ఉండదని స్పష్టంగా తెలుస్తోంది. సీఎం రేవంత్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా ఆయన హస్తిన పర్యటనను విపక్షాలు ఎండగడుతూనే వస్తున్నాయి. దీనికి ఇప్పుడు సీఎం నేరుగానే సమాధానం ఇచ్చారు. సీఎం ఢిల్లీ పర్యటన పైన ఇంత రచ్చ ఎందుకు. ఇందులో విమర్శలకు దారి తీసేంత వ్యవహారం ఏముంది? అనే వారు వున్నారు. అదే రాజకీయం అంటారు ఇంకొందరు. అధికారంలో వుండే వాళ్ళు నుంచున్న తప్పే, కూర్చున్న తప్పే అనే రీతిలో విపక్షాలు విరుచుకుపడటం ఓ పద్ధతిగా మారి పోయింది. సీఎం, రాష్ట్ర మంత్రులు ఢిల్లీ వెళ్లి రాష్ట్ర పనులు చేయించుకోవటం ఆనవాయితీ. ఇది ప్రతి పక్ష పార్టీలకు కూడా తెలుసు. అయితే నెలకు నాలుగు, అయిదు సార్లు సీఎం ఢిల్లీ వెళ్ళన్నారని, ఇది ప్రజాధనం దుర్వినియోగం చేయటమేనని విపక్షాలు అంటున్నాయి. కేంద్రం, రాష్ట్రం సఖ్యతతో ముందుకు సాగక పోతే ప్రజలకు అభివృద్ధి దూరం అవుతుందంటారు నిపుణులు. బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలా జరగటం వల్ల రాష్ట్రం ఆర్థికంగా నష్ట పోయిన విషయం వారు గుర్తు చేస్తున్నారు. రాజకీయంగా పార్టీల మధ్య సిద్ధాంతపర విభేదాలు సహజం. కానీ వాటిని రాష్ట్ర ప్రయోజనాలకు ముడి పెట్టటమే ఇబ్బందికరంగా మారుతుంది. సీఎం తరచుగా ఢిల్లీ వెళ్లే అంశాలలో రాష్ట్ర ప్రయోజనం ఎంతో కొంత ఉండాలి అంటున్నారు రాజకీయ నిపుణులు. ఎవరి వాదన ఎలా వున్నా జాతీయ పార్టీలు ఢిల్లీలో ఉన్నంత కాలం ఆ పార్టీలకు చెందిన సీఎం లు హస్తినకు వెళ్లక తప్పదు. ప్రాంతీయ పార్టీల సీఎంలు కూడా ఢిల్లీ పర్యటనలు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలు పొందటం అసాధ్యం. ఇప్పటికి అయినా సీఎం ఢిల్లీ పర్యటనల వివాదాలు పక్కన పెడితే మంచిది. అలా పెడితే రాజకీయం ఏముంది... ఇది నిరంతరం సాగే ఓ విమర్శల ప్రక్రియ. సీఎం రేవంత్ దీనికి స్పష్టంగా సమాధానం చెప్పినా వినే పరిస్థితి లేదు. సీఎం ఢిల్లీ పర్యటనలు ఆగేది లేదు. విపక్షాలు విమర్శలు ముగిసేవి కావు. అది సంగతి.



జీ. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్ట్



# భారత్-యూకే వాణిజ్య ఒప్పందం

భారత్‌యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందంతో యూకే మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులకు మరింత సులభంగా ప్రవేశం లభించనుండగా, ముఖ్యంగా రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు), కార్మికులు, స్టార్టప్‌లు, తయారీ రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. యూకేకు వెళ్లే భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు పన్ను రహిత ప్రవేశం లభించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ఫార్మా, రసాయనాల వంటి రంగాలు ఎక్కువగా లాభపడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఒప్పందం భారత ఎగుమతులను పెంచడంతో పాటు దేశీయ తయారీ, ఉపాధికి కూడా ఊతమివ్వనుంది. ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని 'చారిత్రాత్మక మైలురాయి'గా అభివర్ణించారు. ఈ ఒప్పందం వికసిత భారత్2047 లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా రైతులు, కార్మికులు, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. వస్తువులతో పాటు ఐటీ, కన్సల్టింగ్, ఆరోగ్య, విద్య వంటి సేవల రంగానికీ ఈ ఒప్పందం ప్రయోజనం చేకూరనుంది. అలాగే రెండు దేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యం మరింత పెరుగుతాయని అంచనా. పరిశ్రమ వర్గాల ప్రకారం, ఈ ఒప్పందం ప్రభావంతో 2030 నాటికి భారత్‌యూకే ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు 120 బిలియన్ డాలర్ల(రూ. 11.54 లక్షల కోట్ల)కు చేరే అవకాశం ఉంది. దీంతో అభివృద్ధి చెందిన మార్కెట్లలో భారత వ్యాపారాలకు మరింత బలమైన స్థానం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒప్పందం అమలు ప్రారంభమవడంతో.. పర్యవసానాలు, ప్రభావం పై మరికొన్ని రోజుల్లో అంచనా రానుంది.

# భారత్ లో టాప్-10 రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇవే

**హైదరాబాద్, మహా :** భారత రియల్ ఎస్టేట్ రంగంలో 2026 సంవత్సరానికి గాను అత్యంత విలువైన కంపెనీల జాబితాను గ్రోహేహురున్ ఇండియా విడుదల చేసింది. దేశీయ రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిలో మందగమనం కనిపించినప్పటికీ, అగ్రశ్రేణి డెవలపర్లు తమ స్థానాలను పదిలంగా నిలబెట్టుకున్నారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్‌ఎఫ్ తన విలువలో తగ్గుదల నమోదైనప్పటికీ, మరోసారి అగ్రస్థానంలో నిలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. సీఎన్‌బీసీ టీవీ18 నివేదిక ప్రకారం, ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగం మొత్తం మీద కేవలం 2 శాతం వృద్ధి మాత్రమే సాధించింది. బీఎస్‌ఈ రియాల్టీ ఇండెక్స్ 20 శాతం మేర పడిపోయింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ కొన్ని కంపెనీలు అద్భుతమైన వృద్ధిని నమోదు చేశాయి. ఈ ర్యాంకింగ్స్‌లో అదానీ ప్రాపర్టీస్ అత్యంత విలువైన అన్‌లిస్టెడ్ డెవలపర్‌గా నిలిచింది. అదానీ కుటుంబ సంపద కూడా దాదాపు రూ.38,000 కోట్లు పెరిగినట్లు హురున్ నివేదిక పేర్కొంది. మరోవైపు, డీఎల్‌ఎఫ్ అధినేత రాజీవ్ సింగ్ సంపద కొంతమేర తగ్గి రూ.90,200 కోట్లకు చేరినప్పటికీ, సంపన్నుల జాబితాలో తన ప్రముఖ స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

**టాప్ 10 అత్యంత విలువైన కంపెనీల జాబితా:**

1.డీఎల్‌ఎఫ్: రూ.1,46,600 కోట్ల విలువతో రాజీవ్ సింగ్ నేతృత్వంలోని ఈ సంస్థ మొదటి స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే దీని విలువ 29.3 శాతం తగ్గింది.
2. లోధా డెవలపర్స్: రూ.93,700 కోట్ల విలువతో అభిషేక్ లోధాకు చెందిన ఈ ముంబై సంస్థ రెండో స్థానాన్ని దక్కించుకుంది.
3.ఇండియన్ హోటల్స్ కంపెనీ: తాజ్ హోటల్స్ ఆపరేటర్ అయిన ఈ సంస్థ రూ.93,300 కోట్ల విలువతో మూడో స్థానంలో ఉంది.
4. అదానీ ప్రాపర్టీస్: ఏకంగా నాలుగు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరింది. దీని విలువ 72.5 శాతం పెరిగి రూ.90,400 కోట్లకు చేరింది.
5. ప్రిజం (ఓయో): రితేష్ అగర్వాల్ నేతృత్వంలోని ఈ హాస్పిటాలిటీ ప్లాట్‌ఫామ్ ఆరు స్థానాలు ఎగబాకి రూ.67,200 కోట్ల విలువతో ఐదో స్థానంలో నిలిచింది. దీని విలువ 106.8 శాతం పెరగడం విశేషం.
6. ఫీనిక్స్ మిల్స్: రూ.63,300 కోట్ల విలువతో ఆరో స్థానంలో ఉంది.
7. ఒబెరాయ్ రియాల్టీ: రూ.62,700 కోట్ల విలువతో ఏడో స్థానంలో కొనసాగుతోంది.
8. కె రహేజా కార్ప్: ఐదు స్థానాలు మెరుగు పరుచుకుని రూ.61,700 కోట్ల విలువతో తొలిసారి టాప్ 10లోకి ప్రవేశించింది.
9. ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్: రూ.58,700 కోట్ల విలువతో ఐదు స్థానాలు దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోయింది.
10. గోద్రెజ్ ప్రాపర్టీస్: రూ.53,100 కోట్ల విలువతో ఐదు స్థానాలు కోల్పోయి పదో స్థానంతో సరిపెట్టుకుంది.



## వలిగొండ పిఏసిఎస్ చైర్మన్‌గా గరిసె రవి నియామకం

**వలిగొండ జులై 15 మహా న్యూస్ :** వలిగొండ పిఏసిఎస్ నూతన చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరిసే రవిని నియమిస్తూ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా పిఏసిఎస్ నూతన చైర్మన్ గరిసే రవి మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి నా మీద పెట్టిన బాధ్యతకు రైతుల పక్షాన రైతు సంక్షేమమే తన బాధ్యతని తెలిపారు. నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు

## చిన్నగొల్లగూడెంలో బాదితులను పరామర్శించిన ఎమ్మెల్యే జారె

**దమ్మపేట ,జూలై 15 మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలంలోని చిన్న గొల్లగూడెం గ్రామంలో బుధవారం అశ్వారావుపేట శాసనసబ్యులు జారె ఆది నారాయణ పర్యటించారు. ఆ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నాయకులు గుర్రం మల్లేశ్వరరావు నివాసంలో కార్యకర్తల తో కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం గ్రామస్థుల సూచన మేరకు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు కుటుంబ సబ్యులను పరామర్శించి ఆర్థిక సహాశయం అందించారు. కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి వారికి సంక్షేమ పధకాలను అందించేలా చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అద్యక్షుడు కక్కిరాల రమేష్ ,దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ,చిన్నశెట్టి గోపి ,పట్టణ అద్యక్షుడు మచ్చల శివ ,ఆరుమూళ్ళ పవన్ , కౌలూరి రాము ,యాట్ల శివ తదితరులు ఉన్నారు.

## మృతి చెందిన కుటుబానికి భోజన ఏర్పాట్లు

**దమ్మపేట ,జూలై 15 మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన వి.ఆర్.ఏ మన్మధ రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. కాగా బుధవారం ఆయన స్వగ్రామంలో కుటుంబ సబ్యులు దహన సంస్కారాలు జరిపే సందర్బంలో మానవతా దృక్పథంతో స్థానిక గౌతమ్ బుద్ద స్వచ్ఛంద సేవా సంస్థ ఆద్వర్యంలో మృతుని కుటుంబ సబ్యులకు ,బంధువులకు భోజన వసతులు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనాదలకు , నిరుపేదలకు ఈ విధమైన ఏర్పాట్లు ,దహన సంస్కారాలు చేస్తున్న గౌతమ బుద్ద సేవా సంస్థ కు చెందిన సబ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పాలడుగుల అబ్బులు , షేక్ అజీమ్ , రొయ్యల కుమార్ ,గ్రామ పెద్దలు దేవరపల్లి అజయ్ కుమార్ ,చీర్నేని వెంకయ్య ,దారా విజయ్ , తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యే గొప్ప సంపద

- మన పిల్లలకు డబ్బు కంటే నాణ్యమైన విద్యనే అందించాలి
- భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి జూలై 15 మహా :** మన పిల్లలకు డబ్బు కంటే నాణ్యమైన విద్యను అందించడమే ముఖ్యమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.. బుధవారం 3.65 కోట్ల రూపాయలు సీఎస్ఆర్ నిధులతో కేజీబీవీ పాఠశాలలో 'స్కూల్ ట్రాన్స్ఫర్మేషన్', 'ఐస్పార్క్' కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు . యాదాద్రి భువనగిరి జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో రూ.3.65 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన 'స్కూల్ ట్రాన్స్ఫర్మేషన్', 'ఐస్పార్క్ కార్యక్రమాలను భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గారితో కలిసి ప్రారంభించారు. జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో 4,673 మంది విద్యార్థినుల భద్రత, సౌకర్యార్థం సోలార్ ఫెన్సింగ్, బంకర్ బెడ్స్ మరియు అత్యాధునిక రోబోటిక్ & సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారుఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో చదివి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎంపీ పిలుపునిచ్చారు. క్లాస్ రూమ్‌లలో స్నేహపూర్వక వాతావరణంలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక ప్రమాణాలతో 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ , 14వ వార్డ్ కౌన్సిలర్ తమ్మిటి పాండు యాదవ్ పాల్గొన్నారు. వీరితో పాటు ఐఓసీఎల్ ప్రతినిధులైన టిఎపిఎస్‌ఓ సిజిఎం (ఇంజనీరింగ్) టి.కె. ఇలమారన్, పీఏ పీఎస్‌ఓ డీజీఎం ( హెచ్ఆర్ సిఎస్ఆర్) పి. కైలాష్ కాంత్, మల్కాపూర్ టెర్మినల్ డీజీఎం (టెక్నికల్) విశ్వేశ్వర రావు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.



# చదువుపై శ్రద్ధ పెట్టాలి

**ఆదిలాబాద్ మహా:** విద్యార్థులు సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం సోనాల మండల కేంద్రంలోని పిఎంశ్రీ జడ్పీ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట రాగి జావ వంటి పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు రాగి జావ ఎంతో దోహదపడుతుందని, జంక్ ఫుడ్స్, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కమిటీ ఆధ్వర్యంలో ఒక ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.. దీని ద్వారా వచ్చే ఫిర్యాదులను హెచ్ఎంతో కలిసి కమిటీ స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఏపీజే అబ్దుల్ కలాం, డా. బి.ఆర్. అంబేద్కర్, ఎస్.ఆర్. శంకరన్ వంటి మహనీయుల జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చినట్లు తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లను కేవలం చదువు కోసమే ఉపయోగించాలని, రీల్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ క్రీడల్లోనూ రాణించాలని హితవు పలికారు. పాఠశాల అభివృద్ధికి డీఆర్డీఓ సహకారంతో న్యూట్రీ గార్డెన్స్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, టాయిలెట్ల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో కొత్త ఎంఆర్‌ఓ ఆఫీస్ భవన నిర్మాణాన్ని సైతం త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో గ్రంథాలయం, న్యూట్రి గార్డెన్లను ప్రారంభించి మొక్కను నాటి నీరు పోశారు.అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్ లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అధికారులకు తగు చర్యల నిమిత్తం ఆదేశాలకు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డిఈఓ మాధవి, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఎంఆర్ఓ మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్ రావు, ఏంఈఓ ఉస్సేన్, సర్పంచ్ బిందుజ, ప్రధానోపాధ్యాయులు సచిన్, విద్యాశాఖ సిబ్బంది అజయ్, విడిసి సభ్యులు తుల శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

- డిజిటలైజేషన్ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలు తీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఐఎఎస్ బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి ప్రత్యేక సమగ్ర ఓటర్ సర్వేన చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి సర్వే లో అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా సహకారం అందించాలని అన్నారు. ఈ

సమావేశంలో జి సంధ్యారాణి,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ, వైవి గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి,జెడ్పి సీఈఓ రాంరెడ్డి,వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు, మరియు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ జన్మదిన వేడుకలు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష పుట్టిన రోజును పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్‌రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆమెను శాలువాలతో సత్కరించారు. పెద్ద సంఖ్యలో హాజరైన శ్రేణులు అభిమానుల మధ్య ఆమె కేక్ కట్ చేసారు. కాంగ్రెస్ శ్రేణులు ఆమె కు కేక్ తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ ,ఎంఏ షకీల్, రఫీక్, దేరా కృష్ణారెడ్డి , అశోక్, విటల్ , రాంరెడ్డి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**యాదాద్రి భువనగిరి జూలై 15 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో మండల పరిషత్ కార్యాలయం, కేజీబీవీ పాఠశాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు . బుధవారం ఆత్మకూరు (ఎం) మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల అమలులో వేగం పెంచి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఉపాధి హామీ పథకం ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఎస్. శ్రీనివాస్‌ను డీఆర్‌డీఏ కార్యాలయానికి సరెండర్ చేయాలని మండల అభివృద్ధి అధికారిని (ఎంపీడీఓ) ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ విద్యార్థినులతో ముచ్చటించారు మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ, ఇతర వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. పాఠశాలలోని కిచెన్ షెడ్‌ను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, నాణ్యమైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు.



## జన్మదినం సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సేవా కార్యక్రమాలు

**అదిలాబాద్ మహా :** మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష జన్మదినం సందర్భంగా బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న సత్య సాయి నిత్యాన్నదాన కేంద్రాన్నిఆమె సందర్శించి అన్నదానం చేసారు. నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగుల వెంట వచ్చిన సహాయకులకు చైర్ పర్సన్ భోజనం వడ్డించారు. అనంతరం కుమురం భీమ్ కాలనీలోని ఆదివాసీ పిల్లలకు ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అక్కడి పాఠశాలను సందర్శించిన చైర్పర్సన్, విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, బ్లాక్‌బోర్డు వంటి మౌలిక విద్యా సౌకర్యాలు సరిపడా లేవని తెలుసుకుని వెంటనే స్పందించారు.తన సొంత ఖర్చులతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, ఎరేజర్లు, అలాగే ఆధునిక వైట్ బోర్డును కొనుగోలు చేసి అందజేశారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ వారి చదువుకు తన వంతు సహాయాన్ని అందించారు.పలు ఆలయాలు సందర్శించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమాల్లో కాలనీవాసులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాటల్లో కాదు చేతల్లో చూపించాం

- వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయాలు
- మామునూరు విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో దశాబ్దాల కలకు సాకారం
- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం
- ఎమ్మెల్యే నాయిని, ఎంపీ, డిసిసి,కుడా చైర్మన్ ఇనగాల



**వరంగల్ హన్మకొండ మహా :** రంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు హర్షం వ్యక్తం చేస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వరంగల్ ఎంపీ కడియం కావ్య , హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కొత్త ఊపందుకుందని ఎమ్మెల్యే అన్నారు. వరంగల్ జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ప్రాజెక్టులను వరుసగా అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని చెప్పారు. అభివృద్ధి అంటే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అనే మాటను ప్రభుత్వం మాటల్లో కాదు చేతల్లో నిరూపిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ గత ఎన్నికల సమయంలో వరంగల్ ప్రజలకు మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు వంటి అనేక హామీలు ఇచ్చారని, కానీ పదేళ్లపాటు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల ఆశలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే వరంగల్ భవిష్యత్తును మార్చే నిర్ణయాలు తీసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేసి కేంద్ర అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు, కాకతీయ సంస్కృతి ప్రతిబింబించేలా ఆధునిక సౌకర్యాలతో విమానాశ్రయం నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలకు భూసేకరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం సూచించినప్పటికీ, వరంగల్ విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి రూ.300 కోట్లు కేటాయించి భూసేకరణ పూర్తి చేసిందన్నారు. ఈ చర్య వల్లే కేంద్ర ప్రభుత్వం నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసిందని చెప్పారు. గత ప్రభుత్వం భూసేకరణ విషయంలో నిర్లక్ష్యం వహించిందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కూడా స్పష్టం చేశారని గుర్తుచేశారు. వరంగల్ నగర ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సుమారు రూ.5,300 కోట్లతో టెండర్ల ప్రక్రియ ఈ నెలాఖరులో పూర్తవుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వరంగల్ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో పనిచేస్తోందన్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. అవినీతి జరిగిందంటూ మాట్లాడేవారు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పని పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని స్పష్టం చేశారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులకు నిజంగా వరంగల్ అభివృద్ధి పై చిత్తశుద్ధి ఉంటే కాజీపేట రైల్వే డివిజన్ సాధించి చూపాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వంలో ఉండి కూడా వరంగల్‌కు రావాల్సిన ప్రధాన ప్రాజెక్టులను తీసుకురాలేకపోయారని విమర్శించారు. విమానాశ్రయ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని కప్పి పుచ్చేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసిన నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు 2028 జూన్ నాటికి మామునూరు విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వరంగల్ అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను వరంగల్‌కు తీసుకువచ్చి జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోడు భూములలో స్ట్రెంచ్ పనులు ఆపాలి

- ఫారెస్ట్ అధికారులకు చేతనైతే గిరిజనేతరులు పోడు లాక్కోండి
- ఆదివాసి నేత సనప కోటేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఆదివాసి పోడు భూములలో స్ట్రెంచ్ పనులు ఆపాలని అవసరమైతే ఫారెస్ట్ అధికారులకు చేతనైతే గిరిజనేతరులు పోడు భూములను లాక్కోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ)జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వరరావు సూచించారు. బుధవారం జరిగిన సమావేశంలో సనప కోటేశ్వరరావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూముల్లో ఫారెస్ట్ అధికారులు స్ట్రెంచ్ పనులు నిలిపివేయాలి అన్నారు. అటవీ హక్కుల చట్టం 2006కు ముందు నుండి ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్న అందులో కొన్ని భూములకు పట్టాలు ఇచ్చి మిగిలిన భూములకు పట్టాలు రాలేదన్నారు. అలాంటి భూములను నేడు పట్టాలు లేవు అనే సాకుతో సాగులో ఉన్న పోడు భూములను లాక్కోవటం ఫారెస్ట్ అధికారులకు తగదన్నారు . ఫారెస్ట్ వారికి చేతనైతే గిరిజనేతరులు అక్రమంగా ఎటు వంటి హక్కులు లేకున్న ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలకు విరుధంగా పోడు సాగుచేస్తున్నారని వారి భూముల్లో స్ట్రెంచ్ పనులు చేపట్టాలని జిల్లాలో ఎన్ని వేల ఎకరాలు గిరిజనేతరుల చేతిలో ఉన్నవి అనేది లెక్క తేల్చాలని అలాంటి గిరిజనేతరుల భూములు లాక్కుని భూమి లేని నిరుపేద ఆదివాసీలకు పంపిణీ చేయాలని అటవీ శాఖ అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురసం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

- గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి
- మంచాల మండలంలో రూ.9 కోట్లతో రంగాపూర్ నుండి మాల్ వరకు బిటి రోడ్డుకు శంకుస్థాపన

**ఇబ్రహీంపట్నం జూలై 15 మహా**:కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని గ్రామాల్లో రోడ్లు అద్దాల్లా కన్పిస్తున్నాయని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం రోజున మంచాల మండలంలోని రంగాపూర్ నుండి చీదేడు దాద్ పల్లి నల్లవెల్లి గ్రామాల మీదుగా మాల్ వరకు వెళ్లే బిటి రోడ్డుకు రూ.9కోట్ల రూపాయల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఏనాడూ లేని విధంగా గ్రామాల్లో వందల కోట్ల రూపాయలతో బిటిరోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తున్నట్లు తెలిపారు తాజాగా రూ. 9కోట్ల రూపాయలతో మంచాల మండలంలోని రంగాపూర్ నుండి చీదేడు దాద్ పల్లి నల్లవెల్లి గ్రామాల నుండి మాల్ వరకు బిటి రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ప్రజలకు రవాణా సౌకర్యం సులభతరం అవుతుందని అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు వేస్తూ రాష్ట్రంలో నియోజకవర్గంను ముందువరుసలో ఉంచడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, ఈసి శేఖర్ గౌడ్, ఎదుల్ల పాండురంగా రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, మంకాల కరుణాకర్, సర్పంచ్ లు నేనావత్ బాలకృష్ణ, గునుకుల పరమేశ్వరి తిరుమలేష్, నేనావత్ శాంతి రాజునాయక్, కంబాలపల్లి బుగ్గరాములు కాట్రోత్ మధు ఎండి అశ్రఫ్ గౌరిగే కృష్ణ దూసరి రాజు ప్రభాకర్ ఎమ్మార్వో ప్రసాదరావు ఎండివో వసంతలక్ష్మి పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి భవిష్యత్తుకు తాడిచర్ల బొగ్గు గని

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**సింగరేణి భవిష్యత్తుకు తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ గని కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని సింగరేణి డైరెక్టర్(పీ అండ్ పీ)కె.వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెం ఏరియాలో బుధవారం జరిగిన తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ పురోగతికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించే దిశగా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జీఎం ఎం.షాలెమ్ రాజు మాట్లాడుతూ తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణి సంస్థకు సుస్థిరమైన భవిష్యత్తు ఏర్పడిందన్నారు. సంస్థ అభివృద్ధి కార్మిక సంక్షేమం కొత్త బొగ్గు గనుల సాధన ఉత్పత్తి వ్యయ నియంత్రణ ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సంస్థ పురోగతికి కట్టుబడి ఉందని ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లుతో పాటు కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెమ్ రాజు, వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి. నరసింహారావు, ఎస్వోటు జీఎం ఎం.గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, పీవీకే5 మేనేజర్ రవి కిరణ్, ఏరియా ఇంజినీర్ వి.రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, పీవీకే వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్, ఇంచార్జ్ ఆర్ సి హెచ్ పి యశస్వి, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ భూక్యా రమేశ్, ఐఎన్ టియుసి ఫిట్ సెక్రటరీ చిలక రాజయ్య, గని అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.



### డంపింగ్ యార్డ్ తొలగింపునకు
## సంపూర్ణ మద్దతు

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపునకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పోరాడుతున్న అఖిలపక్ష జేఏసీ నాయకులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. బుధవారం స్థానికులు జేఏసీ ప్రతినిధులు ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ పట్టణీకరణలో భాగంగా జవహర్ నగర్ అతిపెద్ద పట్టణంగా వెలిసినందున ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డ్ ను ఇకనైనా దూర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇంత పెద్ద డంపింగ్ యార్డ్ ఏ నగరంలో లేదని అది కేవలం హైదరాబాదులోని జవహర్ నగర్ లో ఉండడం జవహర్ నగర్ ప్రజలు బాధ వర్ణనాతీతమన్నారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా డంపింగ్ యార్డ్ తరలింపునకు ప్రతి ఒక్కరు సహకరించాలని డంపింగ్ యార్డ్ తరలింపునకు ప్రభుత్వం సహకరించేలా ఒత్తిడి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణికి సరికొత్త మైలురాయిగా తాడిచర్ల :2 గని

- 13 ఏళ్ల నిరీక్షణకు ఫలితంగా సింగరేణికి తాడిచర్ల గని లీజు స్వాధీనం.
- సత్తుపల్లి ఏరియా గనులలో కార్మికుల సంబరాలు.

**సత్తుపల్లి, జులై 15: మహా. :** సింగరేణి చరిత్రలో సరికొత్త మైలురాయిని అధిగమించింది. సంస్థ 13 ఏళ్ల నిరీక్షణ ఫలితంగా తాడిచర్ల2 బొగ్గు గని లీజును సింగరేణి కైవసం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో తాడిచర్ల 2 గని సాధన జరిగినట్టు సింగరేణి అధికారులు వెల్లడించారు. సింగరేణి నూతన బొగ్గు గని సాధన సందర్భంగా సత్తుపల్లి ఏరియా గనులలో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం పూట పని ప్రారంభ వేళల్లో జే.వి. ఆర్ ఓసి, జే.వి.ఆర్ సి.హెచ్.పి, కిష్టారం ఓ.సి, జే.వి. ఆర్ డిస్పెన్సరీలలో కార్మికులు రంగులు వెదజల్లుతూ మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందంతో చిందులు వేశారు. ఈ వేడుకకు ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విజయోత్సవ సంబరాలలో పాల్గొన్నారు. చారిత్రాత్మక పండుగలో ప్రతి ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో 45 సంవత్సరాలు సింగరేణికి ఉజ్వల భవిష్యత్తును, తెలంగాణ రాష్ట్రానికి ఇంధన భద్రతను ఇచ్చే తాడిచర్ల 2 గని కేటాయింపు తో పాటు భవిష్యత్తులో కోయలగూడెం, సత్తుపల్లి లలో బొగ్గు గనులను సింగరేణి కైవసం చేసుకునే విధంగా చర్యలు చేపడతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీలతో కూడిన సందేశాన్ని కార్మికులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జే.వి.ఆర్ ఓ.సి ప్రాజెక్టర్ ఆఫీసర్ ఎన్వీఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ సోమశేఖర్ రావు, ఎస్.ఓ.టు జి.ఎం బొల్లం శ్రీనివాస్, డిస్పెన్సరీ వైద్యులు నరసింహారావు, భూక్య రాంబాబు, జే.వి.ఆర్ సంక్షేమ అధికారిని కావ్య, యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో సింగరేణి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



## ఆసుపత్రికి వచ్చే వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**.. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, మహా:** వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల విలువలు, రిజిస్టర్లు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారితో స్నేహపూర్వకంగా మెదలాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణుల వివరాలు పరిశీలించి గర్భిణులు తప్పనిసరిగా ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ల్యాబ్ ను సందర్శించి ప్రతిరోజు ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలం సమీపించినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ తో కలిసి బెల్లంపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ కృష్ణ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ నెల 24వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థులతో సరిచూసి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**.. నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి...**

కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల, మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంటశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తయారీకి వినియోగించే నిత్యవసర సరుకుల నాణ్యతను పరిశీలించి ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..



## నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

- నిబంధనల ఉల్లంఘునులపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు
- 36 కేసులు నమోదు.. రూ.7,510 జరిమానా విధింపు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 36 వాహనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి రూ.7,510 జరిమానా విధించి వసూలు చేశారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులు అందరూ తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్లను వక్రీకరించడం అంకెలను మార్చడం లేదా స్పష్టంగా కనిపించకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. పట్టణంలో రోడ్డు భద్రతను పటిష్టం చేయడానికి ఇటువంటి డ్రైవ్ లు నిరంతరం చేపడుతామని పోలీసులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు అత్యంత కీలకం

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి , మహా:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు అత్యంత కీలకం అని,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు ,పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు.ఎస్ ఐ ఆర్ 2026 విజయవంతానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి బుధవారం నాడు బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు, 4వ వార్డు, 17వ వార్డులలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR-2026) అవగాహన కార్యక్రమంలో పార్టీ. ముఖ్యఅతిథిగా పాల్గొని బెల్లంపల్లి ఎమ్మెల్యే గౌరవ శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, వివరాల సవరణ, అనర్హుల పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లులు అందజేశాం, అలాగే మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజ్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేపించి పనులు చేపడుతామని, బెల్లంపల్లి పట్టణంలో రోడ్ల విస్తరణ (రోడ్ వైడెనింగ్) మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా త్వరలోనే ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి తోపాటు సంబంధిత అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసం, ఆశీర్వాదంతోనే నేను ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం పొందాను. ప్రజాసేవే తన ధ్యేయం,ప్రజల సమస్యల పరిష్కారమే నా బాధ్యత. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, బెల్లంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమాన్ని సందర్శించిన హ్యూమన్ రైట్స్ బృందం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం లోని స్నేహలత సంధ్యలత వృద్ధుల ఆశ్రమమును బుధవారం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ టీం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా టీం సభ్యులు ఆశ్రమంలో అందుతున్న భోజన సదుపాయాలు ఆరోగ్య విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వృద్ధులకు కావాల్సిన నిత్యావసర కిరాణా సరుకులను, బియ్యాన్ని పంపిణీ చేశారు. తదనంతరం బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థిని విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించడం జరిగింది. తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ని కలిసి మహిళల లైంగిక వేధింపుల నిరోధక చట్టం కమిటీకి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ డాక్టర్ బొడ్డుపాటి దాస్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాల్వ సుధాకర్ రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మాలోతు రామదాసు నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు సిరివెన్నెల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్చార్జ్ గడ్డం సామ్యూల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సలహా కమిటీ అధ్యక్షులు ఎస్.కె.అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు పై సమీక్షా సమావేశం

**పాల్గొన్న అడిషనల్ కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే**

**మహా వరంగల్ బ్యూరో; వరంగల్** తూర్పు నియోజకవర్గం లోని 41వ డివిజన్ లో ఎస్ఐఆర్ కార్యక్రమం లో భాగంగా బుధవారం అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) వై బి గణేష్ తో కలిసి గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సంబంధిత బి ఎల్ వో లు, బి ఎల్ ఎ లతో కలిసి బూత్‌ల వారీగా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆర్ కార్యక్రమం అమలులో ఎదురవుతున్న పలు సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఇప్పటివరకు సమర్పించిన ఫారమ్ 1ల సంఖ్య, చనిపోయిన ఓటర్ల వివరాలు, డబుల్ ఓట్ల గుర్తింపు, ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తులు, ఇంకా ఫారమ్ లు సమర్పించని ఓటర్ల వివరాలు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే 2002 నాటికి ఓటు హక్కు లేని వ్యక్తుల వివరాలు, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ, అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేసే విధానం పై ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యంగా బిఎల్ వో లు, బి ఎల్ ఎ లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో బి ఎల్ వో లు, బి ఎల్ ఎ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్1 సాధించడం గర్వకారణం

- మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, మహా:** సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్1 సాధించడం గర్వకారణం అని మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ అన్నారు. బుధవారం మందమర్రి జిఎం తన ఛాంబర్ లో ఈమధ్య గ్రూప్ వన్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి డీఎస్పీగా ఎన్నికైన డి ప్రవీణ్ కుమార్ ను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సింగరేణి కార్మికులు కష్టపడి పనిచేస్తూనే, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. ఏరియా కే.కే. ఓపెన్ కాస్ట్ మైన్ లో కన్వేయర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న డి రవీందర్ కుమారుడు డి ప్రవీణ్ కుమార్ ఈ ఘనత సాధించడం సింగరేణియులు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. గ్రూప్1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రవీణ్ కుమార్ ను ప్రభుత్వం పెద్దపల్లిలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా నియమించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్ పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలిసిన వలిగొండ పిఏసిఎస్ చైర్మన్ గరిసె రవి

**యాదాద్రి భువనగిరి జూలై 15 మహా**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా నియమితులైన గరిసె రవి బుధవారం భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నూతన చైర్మన్ గరిసె రవికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందిస్తూ సహకార రంగ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరంగరిసె రవి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి, తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ చైర్మన్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, రైతుల సంక్షేమం, సహకార సంఘ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ కాంగ్రెస్ నాయకునికి దక్కిన అరుదైన గౌరవం

**వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోడం శివకృష్ణ**



**మహా వరంగల్ బ్యూరో;** రంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొండా దంపతుల వీరాభిమాని గా కోడం శివకృష్ణ నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన ఈ నాయకునికి అరుదైన గుర్తింపు లభించింది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కొండా దంపతుల సూచనల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారథి బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో వరంగల్ జిల్లా స్థాయి కమిటీని ప్రకటించింది. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో పార్టీ కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన కోడం శివకృష్ణకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయనను నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేసిన కోడం శివకృష్ణ కష్టాన్ని గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**శివకృష్ణ మాట్లాడుతూ**

"పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని అధిష్టానం, సీనియర్ నాయకుల మార్గదర్శకంలో వరంగల్ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే నా లక్ష్యం" అని అన్నారు.

**కార్యకర్తల హర్షం***

కోడం శివకృష్ణ నియామకం పై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో కష్టపడే నాయకుడికి అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందని శివకృష్ణ నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుంది" అని కార్యకర్తలు అన్నారు.

**సీనియర్ నేతల అభినందనలు:**

ఈ సందర్భంగా కొండా దంపతులతో పాటు, పలువురు సీనియర్ నేతలు, ముఖ్య నాయకులు కోడం శివకృష్ణను అభినందించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని, యువ నాయకత్వానికి అవకాశాలు కల్పిస్తామని వారు పేర్కొన్నారు.

**కోడం శివకృష్ణ ఎవరు?**

గత 15 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఎన్నికల సమయంలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కోసం నిస్వార్థంగా పని చేశారు. డివిజన్ ప్రజలకు అండగా, కార్యకర్తల సమస్యల పై ఎప్పుడూ అండగా ఉంటారని పార్టీలో మంచి పేరు ఉంది వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కోడం శివకృష్ణ ను కలిసి అభినందనలు తెలుపుతూ శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# కాకర్లపల్లి ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజా సంఘాల నాయకుల డిమాండ్.**

**సత్తుపల్లి, జులై 15: మహా :** మండల పరిధిలోని కాకర్లపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, నూతన తరగతి గదులు, లైబ్రరీ రూమ్, శాశ్వత ఇంగ్లీష్ టీచర్ నియామకం చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు జాజిరి శ్రీనివాస్, జాజిరి జ్యోతి, కువారపు లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, విద్య స్థితిగతులపై బుధవారం కాకర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా మండల కమిటీల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కాకర్లపల్లి ఉన్నత పాఠశాల ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు యూనిఫామ్ ఇవ్వలేదన్నారు. పాఠశాలలో 11 కంప్యూటర్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగానికి సరైన గది లేకపోవడంతో కంప్యూటర్ లు నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం వలన ప్రస్తుతం ఉన్న క్లాసులు సరిపోక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో మూడు నూతన తరగతి గదులను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లైబ్రరీ నిర్మించడం వలన విషయ పరిజ్ఞానం, జనరల్ నాలెడ్జి, సందేహాల నివృత్తి, వ్యక్తిగత వికాసం పెంపొందించడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఆడపిల్లలకి ప్రత్యేకంగా ప్రతి నెల సానిటరీ ప్యాడ్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సింగరేణి బాంబు తీవ్రతతో కలుషితమైన సాధారణ నీటిని తాగడం వలన విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల త్రాగునీటి సమస్య తీర్చడానికి పాఠశాలలో మినీ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలవడంతో ఆవరణ బురదమయంగా మారుతుందని, బురదలో విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఆట స్థలంలో మొరం పోయించి పిల్లలు ఆడుకునే విధంగా మైదానాన్ని శుభ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం బాధ్యులు బండి వేలాద్రి,దాట్ల రాంబాబు, కొప్పుల చిన్నస్వామి, ఆంగోతి చిట్టెమ్మ, శైలజ, సుధాకర్ తదితరులు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి జులై 15 మహా :** జిల్లాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలు, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ జయంతి మాట్లడుతూ జిల్లాలోని మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి మండలంలో పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని సూచించారు. అదేవిధంగా కొండమడుగు, జిబ్లాక్‌పల్లి, సిగన్నగూడెం ప్రాంతాల్లోని 2బీహెచ్‌కే కాలనీల భవనాలు, మౌలిక సదుపాయాల పనుల స్థితిగతులపై ఆరా తీశారు. కొండమడుగులోని 30 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేసి, పూర్తిగా అర్హులైన వారినే ఎంపిక చేసేలా చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మండలాల్లో పూరి గుడిసెలు, డేరాలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పీడీ (హౌసింగ్), ఎంపీడీఓలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (హౌసింగ్), అసిస్టెంట్ ఇంజినీర్లు (హౌసింగ్), పంచాయతీరాజ్ శాఖ అధికారులు , మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్ గూడా రైతుల భూములను కాపాడుకుంటాం

- **అవసరమైతే రైతుల కోసంకేటీఆర్ ను రప్పిస్తా...**
- **నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి...**



**రాజేంద్రనగర్ మహా ;** బహదూర్ గూడ రైతుల భూ పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కోలాన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి రైతు దీక్షకు బుధవారం సంఘీభావం తెలిపారు.బహదూర్ గూడలో రైతులు చేస్తున్న భూ పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ, సబితా ఇంద్రారెడ్డి అండగా ఉంటుందన్నారు. అయిన మాట్లాడుతూ బహదూర్ గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1. 101 వరకు 1350 ఎకరాలు పట్టా భూములు ఉన్నాయి. తాతల తండ్రుల కాలం నుంచి కాపాడుకున్న విలువైన భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటే చూస్తూ ఊరుకోం గుబగుయ్యమనేలా కొడతామన్నారు. భయభ్రాంతులకు గురిచేస్తూ హైడ్రా, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రాణాలను సైతం అర్పిస్తాం భూములను కాపాడుకుంటామన్నారు. బహదూర్ గూడ రైతుల కోసం అవసరమైతే కేటీఆర్ రంగంలోకి దిగుతారు. సర్వేనెంబర్ 1 నుంచి 101 వరకు 1350 ఎకరాల రైతుల భూములు ఉన్నాయి. రికార్డులను తారుమారు చేసి 1 నుంచి 76 వరకే రికార్డులనుఉంచారు. స్టేటస్కో ఉన్నా భూములలో రెవెన్యూ అధికారులు ఎలా సర్వే నిర్వహిస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో తన గెలుపు కోసం బహదూర్ గూడ రైతులకు పట్టా పాస్బుక్కులు ఇస్తానని నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచిన ప్రకాష్ గౌడ్. నేడు ఏ ముఖం పెట్టుకొని రైతుల భూములను ప్రభుత్వ భూములుగా ఎమ్మెల్యే ఎలా నిర్ధారించారు. రెండు సంవత్సరాలు ఓపిక పట్టండి రాష్ట్రంలో మన ప్రభుత్వం ఏర్పడుతుంది, రాజేంద్రనగర్ లో మన పార్టీ గెలుస్తుంది. పట్టా పాస్ బుక్కులను బిఆర్ఎస్ ప్రభుత్వంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చెక్కల ఎల్లయ్య,కోన్నమొల్ల శ్రీను, బుచ్చిరెడ్డి, మోహన్ రావు, గుంటి చరణ్, రైతులు నరసింహ, శేఖర్, సునీల్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- **ఏఏవై 35 కిలోల బియ్యం రద్దు సరికాదు -వ్యకాస**

**కారేపల్లి, మహా :** నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పేద ప్రజలకు ఉపశమనం కలగడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి లో చౌక ధర దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం బియ్యం పంపిణీ తోనే సరిపోతుంది అని అన్నారు. అత్యంత పేదలు నిర్భాగ్యులకు అంత్యోదయ అన్నపూర్ణ (ఏఏవై) కార్డు ల ద్వారా అందించే 35 కిలోల బియ్యం రద్దు చేయడం పేదల కడుపు కొట్టడమే అని అన్నారు. కార్డు కు 35 కిలోలు బియ్యం ఇచ్చేదాన్ని తగ్గించి మనిషికి ఏడు కిలోల ఇవ్వడం అవివేకం అన్నారు. అంత్యోదయ అన్నపూర్ణ రేషన్ కార్డు కొనసాగించాలని, చౌక దుకాణాల ద్వారా 14 నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని డిమాండ్ తో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే నిరసన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు పాసిని నాగేశ్వరావు, అన్నవరపు కృష్ణ, ముండ్ల ఏకాంబరం కర్కపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# భారత వైమానిక దళంలో అగ్నివీర్ వాయు నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానం

- **అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ మహా;**భారత వైమానిక దళం ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్) తో పాటు అగ్నివీర్‌వాయు (కంబాటెంట్) పోస్టుల భర్తీకి ఇంటేక్ 2 2027 కోసం నియామక ప్రక్రియను ప్రారంభించిందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన యువత ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భారత వైమానిక దళంలో సేవలందించాలని ఆమె కోరారు.

ఈ నియామకాలకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జూలై 6, 2026 ఉదయం 11 గంటలకు ప్రారంభమైనదని, జూలై 26, 2026 రాత్రి 11:00 గంటలకు ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://iafrecruitment.cdac.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అగ్నిపథ్ పథకం కింద ఎంపికైన అగ్నివీర్ వాయు అభ్యర్థులు నాలుగు సంవత్సరాల పాటు సేవలందిస్తారని, అనంతరం ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారిలో 25 శాతం మందికి భారత వైమానిక దళంలో శాశ్వత నియామకం కల్పించబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ లో పేర్కొన్న విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, వైద్య ప్రమాణాలు తదితర అర్హతలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకుని తాత్కాలిక అడ్మిట్ కార్డు పొందిన అభ్యర్థులు మాత్రమే ఎంపిక పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.హనుమకొండ జిల్లాలోని అర్హులైన యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని భారత వైమానిక దళంలో సేవలందించే అవకాశం పొందాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.

# భూముల రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**

**హనుమకొండ మహా;** హనుమకొండ జిల్లాలో భూముల రీ సర్వేకు ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను వేగవంతం చేసి, ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి సర్వేతో పాటు పేపర్‌వర్క్‌ను పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రభుత్వ సర్వేయర్లను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ సర్వే పురోగతిపై భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, ప్రభుత్వ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేకు సంబంధించిన నివేదికలను సర్వే బృందాలు సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో భూముల రీ సర్వే విజయవంతంగా నిర్వహించేందుకు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారాన్ని సర్వేయర్లు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు ఉదయాన్నే సర్వే బృందాలు గ్రామాలకు చేరుకుని పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్య, ప్రభుత్వ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.





# ఎనూమ్యరేషన్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సర్ ప్రక్రియలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బిఎల్ఓలతో కలిసి ఓటర్లకు ఎనూమ్యరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రతీ ఓటరకు బి ఎల్ ఓలు విధిగా సర్ పత్రాలు పంపిణీ చేయాలి. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే ఓటర్లకు కూడా ప్రతి ఒక్కరు ఎనూమ్యరేషన్ పారం నింపి దగ్గరలో ఉన్న బిఎల్ఓ కు అందజేయాలన్నారు.ఇది చాలా ఓటర్లకు ముఖ్యమైన ప్రక్రియ ప్రతి ఓటరు సర్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



# భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు స్పష్టం చేశారు. బుధవారం భీమారం మండలంలోని మద్దికల్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మద్దికల్ గ్రామంలో మొత్తం 853 సర్వే నంబర్లలో 4 వేల 810 ఎకరాల విస్తీర్ణం గల భూమి ఉందని పేర్కొన్నారు. దానితో ముగ్గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఒక సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రీసర్వే పనులకు రైతులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని తెలిపారు. తద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం ఉండదని, స్పష్టమైన వివరాలతో నక్షా రూపొందించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ఆరెపల్లి గ్రామం, భీమారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసి ఎటువంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులోగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్‌ను తహసీల్దార్‌తో కలిసి పరిశీలించి మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వానికి అందించాల్సిన సి.ఎం.ఆర్. బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా సరఫరా చేయాలని రైస్ మిల్లు నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 17-07-2026

ANN తెలుగు

# ముందుచూపుతో అడుగులు వేస్తున్న శ్రీలీల



సినీ పరిశ్రమలో స్టార్ హోదా వచ్చిన తర్వాత అవకాశాలు కొంత తగ్గినా చాలామంది హీరోయిన్లు ఆందోళనకు గురవుతుంటారు. అయితే యువ కథానాయిక శ్రీలీల మాత్రం అలాంటి పరిస్థితుల్లోనూ తన కెరీర్‌ను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న తీరు ప్రత్యేకంగా కనిపిస్తోంది. సినిమాలతో పాటు ప్రకటనలు, వాణిజ్య కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల ప్రచారాలు, వైద్య విద్య వంటి విభిన్న రంగాలపై దృష్టి పెట్టడం ద్వారా ఆమె ముందుచూపుతో అడుగులు వేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టాలీవుడ్‌లో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన వారిలో శ్రీలీల పేరు ముందుంటుంది. ధమాకా సినిమా విజయంతో వరుస అవకాశాలు ఆమెను వరించాయి. ప్రముఖ హీరోల సరసన నటిస్తూ అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించింది. ముఖ్యంగా మహేష్ బాబు వంటి స్టార్ హీరోతో నటించిన తర్వాత ఆమె కెరీర్ మరింత వేగంగా దూసుకుపోతుందని సినీ వర్గాలు అంచనా వేశాయి.

అయితే సినీ రంగంలో విజయాలు, అపజయాలు సహజం. ఇటీవల ఆమె నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోవడంతో ఆమె సినీ ప్రయాణంపై పలు రకాల చర్చలు మొదలయ్యాయి. స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు తగ్గుతున్నాయనే ప్రచారం కూడా వినిపించింది. దీంతో ఆమె కెరీర్‌పై సోషల్ మీడియాలో అనేక విశ్లేషణలు సాగుతున్నాయి.

అయితే ఈ పరిస్థితులను శ్రీలీల ఎంతో పరిపక్వంగా ఎదుర్కొంటోందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. సినిమాలపై మాత్రమే ఆధారపడకుండా తన ఆదాయ మార్గాలను విస్తరించుకోవడంపై ఆమె దృష్టి పెట్టింది. సామాజిక మాధ్యమాల్లో ఉన్న భారీ అభిమాన వర్గాన్ని వినియోగించుకుని ప్రముఖ సంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది. వివిధ బ్రాండ్ ప్రచార కార్యక్రమాలు, షోరూమ్ ప్రారంభోత్సవాలు, వాణిజ్య ప్రకటనలు, ప్రత్యేక ఈవెంట్లలో పాల్గొంటూ తన గుర్తింపును మరింత బలపరుచుకుంటోంది.

ఇదే సమయంలో ఆమె వైద్య విద్యను కూడా కొనసాగించాలనే నిర్ణయం తీసుకోవడం విశేషంగా మారింది. సినీ కెరీర్ ఎంత బిజీగా ఉన్నా చదువును నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగడం ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. కెరీర్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉండాలనే ఆలోచనతో ఆమె ముందుగానే ప్రణాళిక రూపొందించుకున్నట్లు కనిపిస్తోంది.

సినిమాల్లో అవకాశాలు ఎప్పటికీ ఒకే స్థాయిలో ఉండవని తెలుసుకుని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అడుగులు వేయడం తెలివైన నిర్ణయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే "దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి" అనే సామెతను గుర్తు చేస్తూ నెటిజన్లు శ్రీలీలను ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం ఆమె కెరీర్‌పై ఎలాంటి ఊహాగానాలు వినిపిస్తున్నా, వాటిని పట్టించుకోకుండా తన పనుల్లో నిమగ్నమై ముందుకు సాగుతోంది.

సినీ పరిశ్రమలో ఒక్క విజయం లేదా ఒక్క అపజయంతో ఎవరి ప్రయాణం ముగిసిపోదు. గతంలో అనేక మంది కథానాయికలు సరైన కథలు, మంచి పాత్రలతో మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అదే విధంగా శ్రీలీల కూడా బలమైన కథలు, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు దొరికితే మరోసారి అగ్రస్థానంలో నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు విశ్వసిస్తున్నారు. మొత్తంగా చూస్తే ప్రస్తుతం అవకాశాలపై జరుగుతున్న చర్చల కంటే, తన భవిష్యత్తును ముందుగానే ప్రణాళికాబద్ధంగా నిర్మించుకుంటున్న శ్రీలీల ఆలోచనా విధానమే ఎక్కువ మందిని ఆకట్టుకుంటోంది. సినిమాలు, ప్రకటనలు, సామాజిక మాధ్యమాలు, విద్య వంటి అన్ని రంగాల్లో సమతుల్యత పాటిస్తూ ముందుకు సాగుతున్న ఆమె, ముందుచూపుతో కెరీర్‌ను నిర్మించుకుంటున్న యువ కథానాయికగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.




# అందంతో ఆకట్టుకుంటున్న రూహి సింగ్

పసుపు రంగు కట్ అవుట్ డ్రెస్‌లో స్టైలిష్ లుక్‌తో మెరిసిపోతున్న నటి రూహి సింగ్ మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అందం, ఆత్మవిశ్వాసం, హుందాతనం కలగలిసిన ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన రూహి, ఇప్పుడు బాలీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్రాల్లోనూ తనదైన గుర్తింపు సంపాదించుకుంటోంది.

1995 అక్టోబర్ 12న రాజస్థాన్‌లోని జైపూర్‌లో జన్మించిన రూహి సింగ్, అందాల పోటీల ద్వారా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె, అనంతరం సినీ రంగంలోకి అడుగుపెట్టింది.

ప్రముఖ దర్శకుడు మధుర్ భండార్కర్ తెరకెక్కించిన 'క్యాలెండర్ గర్ల్స్' (2015) చిత్రంతో బాలీవుడ్‌లో కథానాయికగా అరంగేట్రం చేసింది. ఆ సినిమాలో మయూరి చౌహాన్ పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. తర్వాత 'ఇష్క్ ఫరెవర్' (2016), తమిళ చిత్రం 'బొంగు' (2017), తెలుగు చిత్రం 'మోసాగాళ్లు' (2021)లో నటించి తన నటనా ప్రతిభను చాటుకుంది. సినిమాలతో పాటు ఓటీటీ వేదికపైనా రూహి మంచి గుర్తింపు సంపాదించింది. 'రన్‌అవే లుగాయి', 'చక్రవ్యూహ్' వెబ్ సిరీస్‌లలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు లభించాయి. 'చక్రవ్యూహ్'లోని నటనకు ఫిల్మ్‌ఫేర్ ఓటీటీ అవార్డు నామినేషన్ కూడా దక్కింది. 2018లో విడుదలైన దేశభక్తి ప్రధాన చిత్రం 'రాష్ట్రపుత్ర'లోనూ రూహి కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం సినిమాలు, డిజిటల్ ప్రాజెక్టులను సమాంతరంగా కొనసాగిస్తూ బిజీగా ఉంది. త్వరలో విడుదల కానున్న భారీ కామెడీ చిత్రం 'మస్తీ 4'లో రితేష్ దేశ్‌ముఖ్, అఫ్తాబ్ శివదాసాని, వివేక్ ఒబెరాయ్‌లతో కలిసి నటిస్తోంది. ఈ చిత్రం ఆమెకు మరో కీలక అవకాశంగా భావిస్తున్నారు. అలాగే 'ధమాల్ 4' వంటి ప్రాజెక్టులు కూడా ఆమె చేతిలో ఉన్నట్లు సమాచారం. గ్లామర్, నటన, విభిన్న పాత్రలను ఎంచుకునే ధోరణితో రూహి సింగ్ భారతీయ వినోద రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటూ ముందుకు సాగుతోంది.

# రాజమౌళికి బలమైన మార్కెట్ ఇవే



పాన్ ఇండియా సినిమాల గురించి మాట్లాడితే ముందుగా గుర్తుకు వచ్చే దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి చిత్రాలతో ఆయన భారతీయ సినీ పరిశ్రమలోనే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఉత్తరాది నుంచి విదేశీ మార్కెట్ల వరకు ఆయన సినిమాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. అయినప్పటికీ రాజమౌళి చిత్రాల వ్యాపారంలో ఇప్పటికీ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకకు అత్యంత కీలక స్థానం ఉందనే అభిప్రాయం సినీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

రాజమౌళి సినిమాలకు తొలి నుంచే తెలుగు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అదే స్థాయిలో కర్ణాటకలో కూడా ఆయన చిత్రాలకు ప్రత్యేక మార్కెట్ ఏర్పడింది. బాహుబలి సిరీస్ అక్కడ సాధించిన వసూళ్లు, ఆర్ఆర్ఆర్ విడుదల సమయంలో నమోదైన స్పందన ఈ విషయాన్ని స్పష్టంగా చాటాయి. అందుకే ఈ ప్రాంతాల్లో విడుదల వ్యూహం, థియేటర్ల కేటాయింపు, అడ్వాన్స్ బుకింగ్స్, పంపిణీ వ్యవహారాలపై రాజమౌళి బృందం ప్రత్యేక దృష్టి సారిస్తుందనే ప్రచారం ఉంది.

హిందీ మార్కెట్ విస్తృతమైనదే అయినా అక్కడ సినిమా విజయాన్ని కథ, ప్రచారం, విడుదల సమయం వంటి అంశాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. అయితే తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలో మాత్రం దర్శకుడిగా రాజమౌళి పేరు మాత్రమే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే స్థాయికి చేరుకుంది. ఆయన బ్రాండ్ విలువతోనే తొలి రోజు భారీ ప్రారంభ వసూళ్లు నమోదవుతుంటాయి. అందుకే ఈ ప్రాంతాలను ఆయన సినిమాల అసలు బలమైన మార్కెట్లుగా పరిశ్రమ భావిస్తోంది.

రికార్డు స్థాయి వసూళ్లకు పునాది కూడా ఎక్కువగా ఈ మూడు మార్కెట్ల నుంచే పడుతుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తొలి వారం కలెక్షన్లు, థియేటర్ల నిండుదల, అదనపు ప్రదర్శనల విషయంలో తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక కీలక పాత్ర పోషిస్తాయి. అక్కడ వచ్చిన భారీ స్పందనే తర్వాత దేశవ్యాప్తంగా సానుకూల ప్రభావాన్ని చూపుతుందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ కారణంగానే పంపిణీ హక్కుల విషయంలో కూడా రాజమౌళి బృందం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుందనే టాక్ వినిపిస్తోంది. అత్యధిక ధర చెప్పిన వారికి కాకుండా, స్థానిక మార్కెట్‌పై పూర్తి అవగాహన ఉన్న పంపిణీదారులు, బలమైన థియేటర్ నెట్‌వర్క్ కలిగిన సంస్థలు, గతంలో భారీ చిత్రాలను విజయవంతంగా విడుదల చేసిన అనుభవం ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ విస్తరించినా, రాజమౌళి సినిమాల అసలు బలమైన కేంద్రం ఇప్పటికీ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకేనని చెప్పొచ్చు. ఈ ప్రాంతాల్లో ఉన్న అభిమాన వర్గాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి చిత్రానికి ఘనమైన ప్రారంభం దక్కేలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రతి పెద్ద సినీ బ్రాండ్‌కు ఒక బలమైన మూల మార్కెట్ ఉంటుంది. రాజమౌళి విషయంలో ఆ స్థానం తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకకే దక్కిందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే పాన్ ఇండియా స్థాయిలో విజయాలు సాధిస్తున్నప్పటికీ, ఆయన సినిమాల వ్యాపారంలో ఈ మూడు మార్కెట్లకు ఇప్పటికీ ప్రత్యేక ప్రాధాన్యం కొనసాగుతోందనే చర్చ పరిశ్రమలో మరింత బలపడుతోంది.

# సెన్సార్ వ్యవస్థపై వర్మ ఘాటు వ్యాఖ్యలు



విధానంపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో స్పందించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న సెన్సార్ వ్యవస్థను పూర్తిగా పునఃసమీక్షించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సినిమా నియంత్రణ విధానాల్లో సంస్కరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

డిజిటల్ యుగంలో ప్రేక్షకుల అభిరుచులు, సమాచారాన్ని అందుకునే మార్గాలు పూర్తిగా మారిపోయాయని వర్మ పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్లు, ఓటీటీ వేదికలు, సోషల్ మీడియా, అంతర్జాతీయ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్న సమయంలో థియేటర్లలో ప్రదర్శించే సినిమాలపై మాత్రమే కఠినమైన నియంత్రణలు విధించడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి దేశ భవిష్యత్తును నిర్ణయించే ఓటు హక్కు ఉన్నప్పుడు, ఏ సినిమా చూడాలనే విషయాన్ని కూడా స్వయంగా నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు.

సినిమా అనేది దర్శకుడి ఆలోచనలు, భావాలు, దృక్పథాన్ని వ్యక్తపరిచే ఒక కళారూపమని వర్మ అన్నారు. ఆ కళను ప్రేక్షకులు అంగీకరించాలా, తిరస్కరించాలా అనేది పూర్తిగా వారి వ్యక్తిగత నిర్ణయమని పేర్కొన్నారు. ఒక కమిటీ సినిమా కంటెంట్‌ను నిర్ణయించడం కంటే, ప్రేక్షకుల విజ్ఞతపై నమ్మకం ఉంచడం ప్రజాస్వామ్యానికి మరింత అనుకూలమని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రస్తుతం థియేటర్లలో కొన్ని సన్నివేశాలను తొలగించినా వాటిని ఇంటర్నెట్ ద్వారా కొద్ది గంటల్లోనే ప్రేక్షకులు చూసే అవకాశం ఉంటోందని వర్మ గుర్తు చేశారు. సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌లు, వివిధ డిజిటల్ వేదికల ద్వారా ఏ కంటెంట్ అయినా వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కేవలం థియేటర్ విడుదలలపై మాత్రమే నియంత్రణలు విధించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని సందర్భాల్లో సెన్సార్ కోతలు ఆ కంటెంట్‌పై మరింత ఆసక్తిని పెంచే అవకాశమూ ఉంటుందని పేర్కొన్నారు.

పిల్లలు, యువత ప్రతిరోజూ వివిధ డిజిటల్ వేదికల ద్వారా ఎన్నో రకాల సమాచారాన్ని చూస్తున్న ఈ కాలంలో సినిమాలపై మాత్రమే పరిమితులు విధించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. సమాజంలో జరిగే సంఘటనలు, భావోద్వేగాలు, సామాజిక సమస్యలు, రాజకీయ అంశాలను చర్చకు తీసుకురావడంలో సినిమా కీలక పాత్ర పోషిస్తుందని, అలాంటి మాధ్యమానికి అనవసరమైన అడ్డంకులు సృష్టించకూడదని అభిప్రాయపడ్డారు.

సినిమాలను కత్తిరించడం కంటే వాటి కంటెంట్‌కు సంబంధించిన స్పష్టమైన వయో పరిమితి, హెచ్చరికలు, వర్గీకరణ వివరాలను అందించడం మరింత సమర్థవంతమైన విధానమని వర్మ సూచించారు. ఏ సినిమా చూడాలి, ఏది చూడకూడదు అనే నిర్ణయాన్ని పూర్తిగా ప్రేక్షకులకే వదిలేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే సినిమా రంగానికి చెందిన నిర్మాతలు, దర్శకులు కూడా ఈ అంశంపై విస్తృత చర్చ జరపాలని, ప్రస్తుత వ్యవస్థలో మార్పులపై తమ అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించాలని పిలుపునిచ్చారు.

వర్మ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. కొందరు ఆయన అభిప్రాయాలకు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు సెన్సార్ వ్యవస్థ కూడా సమాజ ప్రయోజనాల దృష్ట్యా అవసరమేనని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సెన్సార్ విధానాలపై మరోసారి జాతీయ స్థాయిలో చర్చ మొదలయ్యేలా రామ్ గోపాల్ వర్మ వ్యాఖ్యలు దారితీశాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com